RNI. No: TELTEL/2023/88215

తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 4 VOLUME : 4 | సంచిక : 121 ISSUE NO : 121 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శనివారం,నవంబర్,14, 2026 Saturday,November,14, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-

నా ఫోన్ ట్యాప్ చేస్తున్నారు..

రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు



న్యూఢిల్లీ,నవంబర్,13 :ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం ఇన్ స్టాగ్రామ్ వేదికగా నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు తన ఫోన్‌ను పైకి ఎత్తి చూపిస్తూ.. ట్యాపింగ్ జరిగినట్లు తన దగ్గర పక్కా ఆధారాలు ఉన్నాయన్నారు. ఆ విషయం ప్రధానికి కూడా బాగా తెలుసని వ్యాఖ్యానించారు. ఇదే వేదికగా ప్రధాని మోదీ బహిరంగ చర్చ జరపాలని రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ముఖాముఖి చర్చ జరిగితే ఎవరు దేశద్రోహి, విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరూ ఉన్నారో అర్థమవుతుందని రాహుల్ పేర్కొన్నారు. కాగా, గతంలో కూడా పెగాసస్ స్పైవేర్ ద్వారా తనతో పాటు పలువురు ప్రతిపక్ష నేతల ఫోన్లను కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు ట్యాపింగ్ చేస్తున్నాయని ఆయన ఆరోపించిన విషయం తెలిసిందే. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ఈ వాదనలను తీవ్రంగా ఖండించింది. ఇదే అంశాన్ని శుక్రవారం రాహుల్ గాంధీ మరోసారి లేవనెత్తారు. ఏదేమైనప్పటికీ, రాహుల్ తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

సామాజిక న్యాయం అమలులో..

తెలంగాణ దేశానికే రోల్ మోడల్: పొన్నం

హైదరాబాద్,నవంబర్,13,తెలంగాణ దిశ :
సామాజిక న్యాయాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతున్న 'భారత్ సమ్మిట్-2026'లో భాగంగా 'తెలంగాణ రైజింగ్ – సామాజిక న్యాయం' అనే అంశంపై జరిగిన ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లే, ఎంపిరికల్ డేటా ఆధారంగా దేశంలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, న్యాయ్ యాత్ర స్ఫూర్తితో, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సమగ్ర కులగణన సర్వే నిర్వహించి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. లక్ష మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేకరించిన డేటా



ప్రకారం రాష్ట్రంలో బీసీ జనాభా 56.36 శాతం ఉన్నట్లు తేలిందన్నారు. కులగణన అనేది కులాలను విభజించడానికి కాదని, తరతరాలుగా వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడానికి అని స్పష్టం చేశారు.

అసోంలో ఘోర రోడ్డు ప్రమాదం.. 23 మంది దుర్మరణం



కజిరం:అసోంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కజిరంగా సమీపంలోని జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళుతున్న మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ముఖాముఖి ఢీకొన్న ఘోర ప్రమాదంలో కనీసం 23 మంది దుర్మరణం పాలయ్యారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం అందుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొకాఖాట్ నుంచి నాగావ్ వైపు వెళుతున్న మినీ బస్సు (ట్రావెలర్) కజిరంగా కోహోరా పరిధిలోని హథీకూలి టీ ఎస్టేట్ సమీపంలో గల రంగాజన్ వద్ద జాతీయ రహదారి 715పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్కును మినీ బస్సు బలంగా ఢీకొట్టింది. మినీ బస్సు పూర్తిగా నుజ్జునుజ్జయి ప్రయాణికులు లోపలే ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక ప్రజలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనం నుంచి మృతదేహాలను వెలికితీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్.. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాల్లో అంతరాయం



న్యూఢిల్లీ,నవంబర్,13 :మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం భారత్‌లోని పలు విమానయాన సంస్థలపైనా పడింది. ఢిల్లీ నుంచి పలు విమాన సర్వీసులను రద్దు చేశామని స్పైస్‌జెట్ ఎక్స్‌లో తెలిపింది. ఢిల్లీ నుంచి పుణె, లేహ్, ముంబైకి వెళ్లాల్సిన సర్వీసులను క్యాన్సిల్ చేశామని తెలిపింది. అలాగే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ కూడా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యల కారణంగా కొన్ని ఫ్లైట్ల సర్వీసులపై ప్రభావం పడింది. లేటెస్ట్ అప్‌డేట్ల కోసం ప్రయాణికులు స్పైస్‌జెట్‌ను సంప్రదించవచ్చు' అని పేర్కొంది. అలాగే మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం ఇండిగోపైనా పడింది. తమ ఈమెయిల్ సపోర్ట్ సేవలపై ప్రభావం పడిందని, తమకు ఎలాంటి ఈమెయిల్స్ రావడం లేదని ఇండిగో ఎక్స్‌లో తెలిపింది.
అయితే, ఇతర సపోర్ట్ చానెల్స్ అందుబాటులోనే ఉన్నాయని పేర్కొంది. అత్యవసర సాయం కోసం తమ వెట్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా 6ఈ స్కాయ్‌ను సంప్రదించాలని సూచించింది. మరోవైపు మైక్రోసాఫ్ట్ అంతరాయాన్ని గమనిస్తున్నామని ఎయిరిండియా తెలిపింది. తమ సర్వీసులపై ఎలాంటి ప్రభావం పడలేదని వెల్లడించింది.
అలాగే తమ ప్రసార సాధనాల్లోనూ ఎలాంటి అంతరాయం లేదని ఎక్స్‌లో పేర్కొంది. వేగవంతమైన సేవలు అందించేందుకు తమ ఈమెయిల్స్‌ను రీరూట్ చేశామని, దాంతో ఎలాంటి అడ్డంకులు ప్రతి మెసేజ్ తమకు చేరుతుందని ఎయిరిండియా వివరించింది.

హైదరాబాద్ నూతన సీపీగా

మహేష్ భగవత్



హైదరాబాద్, నవంబర్ 13,తెలంగాణ దిశ :
నగర నూతన పోలీసు కమిషనర్(సీపీ)గా మహేష్ భగవత్ బాధ్యతలు చేపట్టారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయన ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నగరంలోని శాంతి భద్రతల అంశంపై మాట్లాడా రు. 'హైదరాబాద్‌లో శాంతి భద్రతలు, మహిళా భద్రత, ట్రాఫిక్ వంటివి కీలక అంశాలు. ప్రతి ఏటా 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. అందుకే ఈ అంశాలకు మేము ప్రాధాన్య మిస్తాం. మరోవైపు ల్యాండ్ వాల్యూ పెరగడం వల్ల భూ తగాదాల్లో దాడులు జరుగుతున్నాయి. వీటిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హైదరాబాద్‌లో అనుభవం ఉన్న అధికారులు ఎందరో ఉన్నారు. మేమందరం కలిసి టీమ్‌గా పని చేస్తాం. తరచూ నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. పీడీ యాక్ట్‌లు పెడతాం. పాత నేరస్థులపై నిఘా పెట్టడమే కాకుండా నేరాలు చేసిన వారికి శిక్ష పడేలా చూస్తాం' అని సీపీ మహేష్ భగవత్ భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన గతంలో సీపీగా పనిచేసిన సీవీ ఆనంద్, సజ్జనార్‌లను అభినందించారు. వారు ప్రారంభించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. అలాగే ప్రజల కోసం మరికొన్ని సేవలు తీసుకొస్తామని తెలిపారు. 'డయల్ 112 రెస్పాన్స్ మరింత మెరుగుపరిచేలా పనిచేస్తాం. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్న ముఠాలపై నిఘా పెడతాం. సాయంత్ర వేళల్లో నేరాలు ఎక్కువ జరుగుతున్న నేపథ్యంలో బేసిక్ పోలీసింగ్‌పై దృష్టిసారిస్తాం. సిబ్బందిపోలీస్ స్టేషన్‌లో కూర్చోవడం కాకుండా సాయం త్రం రోడ్‌పై డ్యూటీ చేసేలా చూస్తాం. పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడితేక్రిమినల్ కేసులు బుక్ చేస్తాం.శాఖాపరమైన చర్యలూ తీసుకుం టాం. కమిషనరేట్ పరిధిలో సిబ్బంది కొరత ఉంది. దాన్ని అధిగమిం చేందుకు ప్రయత్నాలు చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

కులం ఎవరి భవిష్యత్తును నిర్ణయించకూడదు : మంత్రి సీతక్క



హైదరాబాద్,తెలంగాణ దిశ :
సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం, ప్రాతినిధ్యం కల్పి ంచినప్పుడే నిజమైన సామాజిక న్యా యం సాధ్యమవుతుందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. సామాజిక న్యాయం అనేది కేవలం ఒక సిద్ధాంతం కాదని, తరతరాలుగా వివక్షకు గురైన వర్గాలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించే బాధ్యత అని స్పష్టం చేశారు. మాదాపూర్ హెచ్ఐసీసీ లోని భారత్ సమ్మిట్--2026లో భాగంగా నిర్వహించిన సామాజిక న్యాయంపై చర్చలో మంత్రి సీతక్క ప్రసంగించారు. తెలంగాణలోని ఒక మారుమూల ఆదివాసీ గ్రామం నుంచి వచ్చి నేడు మంత్రిగా ప్రజల ముందు నిలబడటం తన జీవిత ప్రయాణంలో ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, విద్య, ప్రజాసేవల ఫలిత మని తెలిపారు. తనలాంటి గ్రామాల్లో ఎంతోమంది అమ్మాయిల కు ఎన్నోకలలు ఉన్నాయని,కానీ సరైన అవకాశాలు లేక వారి ప్రతిభ వెలుగు లోకి రావడం లేదని అన్నారు. ప్రతిభ లేక వెనుకబడటం లేదని, అవకాశాలు అందక వెనుకబడుతున్నార ని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమాన తలను తొలగించేందుకు కేవలం మంచి ఉద్దే శాలుసరిపోవని, విధానపరమై న,నిర్మాణాత్మక మార్పులు అవసర మని పేర్కొన్నా రు. ఒక సమాజం సాధించిన అభివృద్ధిని ఆసమా జంలోని మహిళల పురోగతి ఆధారంగా అంచనా వేయాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన మాట లను గుర్తు చేశారు. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఉపాధి కల్పించే వారు,నిర్ణయాధికారులు, నాయకులుగా తీర్చిదిద్దా లన్నదే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై కేటీఆర్ ఫైర్..

రూ.100 కోట్ల ఖర్చుపై ప్రశ్నలు



హైదరాబాద్, నవంబర్ 13,తెలంగాణ దిశ :
ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరా బాద్ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు.'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాహుల్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్.. ఉద్యోగాల కోసం పోరాడు తున్న నిరుద్యోగులపై దాడులు చేయించినప్పుడు రాహుల్ ఎక్కడున్నారని నిలదీశారు. మహిళా ప్రజాప్రతి నిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు, రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలపై మాట్లాడేందుకు సమయం లేదా అంటూ రాహుల్‌పై విరుచుకుపడ్డారు. 'ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ విద్యార్థులను పోలీసులతో గొంతు నులిమి, దాడులు చేయించినప్పుడు మీరు ఎక్కడున్నారు రాహుల్ గాంధీ? లగచర్లలో గిరిజన మహిళలను వారి భూముల కోసం పోరాడుతున్నందుకు కొట్టినప్పుడు, దుస్తులు చింపి అవమానించినప్పుడు మీకు చలనం కలగలేదా? హైడ్రా బుల్డోజర్లతో కష్టపడి జీవిస్తున్న తెలంగాణ ప్రజల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు మీరు ఢిల్లీలో నిద్రపోతున్నారా? కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికి రాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జింకలు, నెమళ్లు సహా విలువైన జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసినప్పుడు.. కేటీఆర్ పార్కును నాశనం చేస్తున్నప్పుడు మీ గొంతు ఎందుకు పెగల్లేదు? రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ లను అపహాస్యం చేస్తూ, 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పుడు మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మహిళా ప్రజాప్రతినిధుల చీరలు లాగి, అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు కనీసం ఒక్క మాటైనా మాట్లాడారా రాహుల్ గాంధీ? రైతుల ఆత్మహత్యలు, చేనేత కార్మికుల బలవన్మరణాలు, అర్ధరాత్రి వేళ జర్నలిస్టుల అరెస్టులు, కార్పొరేట్ అనుకూల విధానాలు, భూకబ్జాలపై మాట్లాడటానికి మీకు సమయం లేదా? మీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా అవినీతి గురించి మాట్లాడుతున్నారు. అయినా మీరునోరు ఎందుకు మెదపడం లేదు? అవసరమైనప్పుడు మౌనం వహించారు.. ఇప్పుడు మాత్రం తెలంగాణ ప్రజల సొమ్ము రూ.100కోట్లతో ప్రచార ఆర్భాటం కోసంసిగ్గులేకుండా వచ్చారా? రాహుల్ గాం ధీ..తెలంగాణప్రజల సొమ్ముతో ఈ ప్రచార పర్యటన లు చేయడానికి మీకు ఎవరు అధికారం ఇచ్చారు? తెలంగా ణ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ఉందా?' అంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

యూపీలో బీజేపీదే పైచేయి.. సీఎంగా యోగికే మద్దతు.. లేటెస్ట్ సర్వేలో కీలక విషయాలు..



లక్నో,నవంబర్,13 :
ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తాజాగా జరిగినఒక సర్వే కీలక విషయాలను వెల్లడించింది. ఓట్ వైబ్‌నిర్వహించిన ఈ సర్వేలో ఓటర్ల అభిప్రాయా లు వెల్లడయ్యాయి.41.9 శాతం మంది బీజేపీ కూటమికి ఓటు వేయాలనే అభిప్రాయాన్ని వెల్లడించగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ(ఎస్పీ)-కాంగ్రెస్ కూటమికి 39.1 శాతం మంది మద్దతు ప్రకటించినట్లు సర్వేవెల్లడించింది.ముఖ్యమంత్రి అభ్యర్థిగా యోగి ఆదిత్య నాథ్,అఖిలేష్‌కు అందనంత స్థానంలో ఉన్నారు. యోగికి 44.1 శాతం మంది మద్దతు ఇవ్వగా, అఖిలేష్‌కు 34.5 శాతం, ప్రియాంకాగాంధీకి 6.5 శాతం, మాయావతికి 5.8 శాతం మంది మద్దతు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏ పార్టీకి ప్రజలమద్దతు ఎక్కువగా ఉందని భావిస్తున్నారని అడిగినప్పుడు 42.2 శాతం మంది ఎస్పీ ముందుందని, 41.2 శాతం మంది బీజేపీ ముందుందని అభిప్రాయపడ్డారు.

పొడవైన తీరం, పోర్టులతో

ఏపీకి చాలా ఉపయోగం

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

విశాఖపట్నం,నవంబర్ 13:దేశాభివృద్ధికి పోర్టులు చాలా ముఖ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పొడవైన సముద్రతీరం, పోర్టులు ఉండడం ఏపీకి చాలా ఉపయోగంగా ఉందన్నారు. ఏపీలో పోర్టులను మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశాభివృద్ధికి పోర్టులు చాలా ముఖ్యమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పొడవైన సముద్రతీరం, పోర్టులు ఉండడం ఏపీకి చాలా ఉపయోగంగా ఉందన్నారు. ఏపీలో పోర్టులను మరింత అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖపట్నంలో రెండో రోజు జరిగిన సీఐఐ సదస్సులో ఆయన మాట్లాడారు.

ప్రజల పక్షాన నిలుస్తూ.. సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

- తెలంగాణ రక్షణ సేన లక్ష్యం ఇదే.. పార్టీ శ్రేణులకు కల్వకుంట్ల కవిత పిలుపు
- మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి..
- ప్రాజెక్టు వ్యయం, పనుల పురోగతిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి



సిద్దిపేట, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడటమే తెలంగాణ రక్షణ సేన ప్రధాన లక్ష్యమని పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, గ్రామగ్రామాన పర్యటిస్తూ స్థానిక సమస్యలను గుర్తించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆమె పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రక్షణ సేన ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు ప్రతిబింబంగా నిలిచే రాజకీయ వేదికగా ఎదగాలని కవిత ఆకాంక్షించారు. కేవలం ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, నిత్యం వారితో మమేకమై వారి కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక అభివృద్ధి, రైతుల ఇబ్బందులు, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, పరిష్కారం కోసం కార్యాచరణ చేపట్టాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల హక్కులు, సంక్షేమం కోసం పోరాడాలని పేర్కొన్నారు.

మల్లన్నసాగర్‌పై ప్రభుత్వాన్ని నిలదీసిన కవిత

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం, భూసేకరణ, నిర్వాసితుల సమస్యలు, ప్రాజెక్టు వ్యయం, పనుల పురోగతిపై కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని పలు ప్రశ్నలు సంధించారు. ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన రైతులు, కుటుంబాలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందా? తగిన పరిహారం, పునరావాస సౌకర్యాలు అందాయా? అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి ప్రాజెక్టుల పేరుతో భూములు కోల్పోయిన ప్రజలు ఇబ్బందులు పడకూడదని, నిర్వాసితుల జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన అంచనా వ్యయం, ఇప్పటివరకు చేసిన ఖర్చులు, పనుల పురోగతి, ప్రజలకు అందిన ప్రయోజనాల వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని కోరారు. ప్రజాధనంతో చేపట్టే భారీ ప్రాజెక్టుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన కుటుంబాల సమస్యలను విస్మరించడం తగదని, బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలవాలని స్పష్టం చేశారు.

ప్రాజెక్టు పరిసర ప్రాంతాల భద్రతపై ఆందోళన

మల్లన్నసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో భద్రత, భూకంపాల ప్రభావానికి సంబంధించిన అంశాలపైనా కవిత ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో చోటుచేసుకున్న భూకంప సంఘటనల నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణం, పరిసర ప్రాంతాలపై వాటి ప్రభావం, భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలపై నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయించాలని కోరారు. సంబంధిత అధికారులు ప్రజలకు వాస్తవాలను వివరించాలని, ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, జీవనోపాధికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని అన్నారు. ప్రజల్లో నెలకొన్న సందేహాలు, ఆందోళనలను నివృత్తి చేసేలా సమగ్ర నివేదికను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

ప్రజల గొంతుకగా తెలంగాణ రక్షణ సేన

ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, వాటి పరిష్కారం కోసం పాలకులను ప్రశ్నించడం, బాధితులకు అండగా నిలవడం రాజకీయ పార్టీల బాధ్యత అని కవిత పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిరంతరం ప్రశ్నించాలని, ప్రభుత్వ విధానాలు ప్రజలకు మేలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పార్టీ నాయకులకు సూచించారు. రైతుల సమస్యలు, భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం, ప్రజల హక్కుల పరిరక్షణ, యువతకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ప్రజలతో సంబంధాలు పెంచుకుంటూ, వారి సమస్యలను పార్టీ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

ఫాక్స్‌సాగర్‌కు మహర్దశ..

- మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి - చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా శ్రీకారం - ఆక్రమణల తొలగింపు, ఐదు మీటర్ల మేర పూడిక తీత.. - నీటి నిల్వ సామర్థ్యం నాలుగు రెట్లు పెంపునకు ప్రణాళిక







కుత్బుల్లాపూర్ నవంబర్ 13, (తెలంగాణ దిశ) :మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ప్రాంతంలోని చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువుకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు హైడ్రా నడుం బిగించింది. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు, ఆక్రమణలతో దుర్భరంగా మారిన చెరువును పునరుద్ధరించి, మినీ జలాశయంగా తీర్చిదిద్దేందుకు శుక్రవారం పనులు ప్రారంభించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ భూమి పూజ చేసి పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫాక్స్‌సాగర్ చెరువును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఏడాది కాలంలో ఈ ప్రాంతంలో అద్భుతమైన సరస్సును ప్రజలు చూడబోతున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు మురుగునీరు, గుర్రపుడెక్కతో చెరువు తన ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రస్తుతం మాధాపూర్‌లోని తమ్మిడికుంటను సుందరంగా అభివృద్ధి చేసిన తరహాలో ఫాక్స్‌సాగర్‌ను కూడా సుందర జలాశయంగా మారుస్తామని వెల్లడించారు.

నాలుగు వేల మిలియన్ లీటర్లకు నీటి నిల్వ సామర్థ్యం

ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు, మురుగునీరు పేరుకుపోవడంతో చెరువులో నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోయిందని కమిషనర్ వివరించారు. ప్రస్తుతం సుమారు వెయ్యి మిలియన్ లీటర్లకు పరిమితమైన నీటి నిల్వ సామర్థ్యాన్ని నాలుగు వేల మిలియన్ లీటర్లకు పెంచడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఐదు మీటర్ల మేర పూడికను తొలగించనున్నట్లు చెప్పారు. పూడిక తొలగింపు వల్ల భూగర్భ జలాల నిల్వలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చెరువు అభివృద్ధికి ముందు, తర్వాత నీటి నాణ్యతతో పాటు పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలను జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో పరీక్షించనున్నట్లు తెలిపారు. చెరువులోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థ జలాలు నేరుగా చేరకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. వర్షపు నీరు చెరువులోకి చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు, వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేస్తామని చెప్పారు. చెరువు కట్టను బలోపేతం చేసి, నీటి ప్రవాహ మార్గాలైన లోపలి, బయటి కాలువలను సక్రమంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

1897 నాటి చారిత్రక కట్టడాలకు పునరుజ్జీవం

నిజాం పాలకుల కాలంలో 1897లో ఫాక్స్‌సాగర్ చెరువును నిర్మించినట్లు చరిత్ర చెబుతోందని రంగనాథ్ వివరించారు. సాగునీటి అవసరాలతో పాటు సికింద్రాబాద్ ప్రజలకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ జలాశయాన్ని నిర్మించారని తెలిపారు. అప్పట్లో చెరువు నీరు నేరుగా హుస్సేన్‌సాగర్‌కు చేరేలా వరద కాలువలను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. చెరువు కట్టపై ఉన్న పురాతన రాతి పంపుహౌస్ ప్రస్తుతం దెబ్బతిన్నదని, దాని చారిత్రక ప్రాధాన్యతను కాపాడేందుకు యూరప్‌కు చెందిన నిపుణుల సహకారంతో పునరుద్ధరిస్తామని తెలిపారు. చెరువు చుట్టూ రహదారిని కూడా నిర్మించనున్నట్లు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు చారిత్రక వారసత్వ సంపదను కాపాడటానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు.

150 ఎకరాల ఆక్రమణల గుర్తింపు

దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఫాక్స్‌సాగర్ పరిధిలో సుమారు 150 ఎకరాల మేర ఆక్రమణలను గుర్తించామని, వాటిలో చాలావరకు ఇప్పటికే తొలగించినట్లు హైడ్రా కమిషనర్ తెలిపారు. అయితే 2024 జూలై 19న హైడ్రా ఏర్పాటుకు ముందు ఉన్న నివాస గృహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. అక్కడ ఉన్న కొన్ని లేఅవుట్లలో భూములు, ప్లాట్లు కోల్పోయే వారికి నిబంధనల ప్రకారం అభివృద్ధి హక్కుల బదిలీ పత్రాలు (టీడీఆర్) అందజేస్తామని పేర్కొన్నారు. చెరువు ప్రధాన కట్ట, పరిసర ప్రాంతాల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పది మీటర్ల మేర బఫర్ జోన్‌ను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. కట్ట దిగువన ఉన్న ఆలయాలు, ఇతర నిర్మాణాల విషయంలోనూ వరద ముప్పును అంచనా వేసి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మొత్తంగా ఫాక్స్‌సాగర్ చెరువు పునరుద్ధరణతో భూగర్భ జలాల పెంపు, వరద ముప్పు నియంత్రణ, పర్యావరణ పరిరక్షణతో పాటు చారిత్రక వారసత్వ సంపదకు పునర్వైభవం లభించనుంది. మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చెందితే జీడిమెట్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఆహ్లాదకరమైన ఆహార్యంతో పాటు పర్యాటక, వినోద సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

పార్కులు, క్రీడా సదుపాయాల అభివృద్ధికి రూ.1.45 కోట్ల నిధులు

- ఏఎస్ రావునగర్‌లో ఆరు అభివృద్ధి పనులకు శంకుస్థాపన - ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి







ఏఎస్ రావునగర్, నవంబర్ 13 (తెలంగాణ దిశ) :ఉప్పల్ నియోజకవర్గంలోని డా. ఏఎస్ రావునగర్ పరిధిలో పార్కుల అభివృద్ధి, క్రీడా సదుపాయాల కల్పనతో పాటు రహదారుల నిర్మాణానికి రూ. 1.45 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు చిన్నారులకు సురక్షితమైన ఆట స్థలాలు, యువతకు వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టనున్న ఈ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మాజీ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ రావునగర్ థీమ్ పార్క్‌లో ఓపెన్ జిమ్, ఈపిడీఎం ఫ్లోరింగ్ ఏర్పాటుకు రూ. 17.50 లక్షలు, టీజిఐఐసీ గ్రౌండ్‌లో ఓపెన్ జిమ్, చైన్ లింక్ ఫెన్సింగ్ ఏర్పాటుకు రూ. 36 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. హాన్స్ అవెన్యూ పార్కులో ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాలు, కాంపౌండ్ వాల్‌కు గ్రిల్ ఏర్పాటు కోసం రూ. 23 లక్షలు వెచ్చించనున్నట్లు వివరించారు. అలాగే విరాట్ నగర్ కాలనీలో వాకింగ్ పాత్‌వే, ఆట పరికరాల ఏర్పాటుకు రూ. 6.50 లక్షలు, శ్రీనగర్ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటుకు రూ. 22.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. బీజేఆర్ కాలనీలోని బీజేఆర్ జంక్షన్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 40 లక్షల నిధులతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే స్థానికులకు మెరుగైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ముఖ్యంగా చిన్నారులు సురక్షిత వాతావరణంలో ఆటలాడేందుకు అవకాశం కలుగుతుందన్నారు. యువతతో పాటు వృద్ధులు కూడా నిత్యం వ్యాయామం, నడక ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ సదుపాయాలు దోహదపడతాయని వివరించారు. అదే విధంగా సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఎంసి కాప్రా సర్కిల్ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి శ్రీ, సూపర్ వైజర్ గన్నోజు రాజశేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాసం మహిపాల్ రెడ్డి, షేర్ మానెమ్మ, లక్ష్మి నారాయణ పటేల్, బేతల బాలరాజు, ఎస్ఏ. రహీమ్, మురళి పంతులు, శివకుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ చారి, భాస్కర్, కృష్ణ, గడ్డం శ్రీనివాస్, సురేష్, పిట్టల రాజు, సుధాకర్, సాంబశివ రెడ్డి, పంతులు నర్సింహ, బండే గౌడ, చంద్రమౌళి, సమాచార హక్కు పరిరక్షణ సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ కాలనీ వాసులు నర్సింహ చారి, దయానంద్, వెంకటయ్య యాదవ్, శేఖర్, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు నేడు కాంగ్రెస్ బైక్ ర్యాలీ

- శిల్పారామం నుంచి భారీ ర్యాలీ..
- కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: కేశెట్టి ప్రసాద్



ఏఎస్ రావునగర్, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :గిగ్ వర్కర్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్ తెలిపారు. తెలంగాణ ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా హైటెక్ సిటీలోని శిల్పారామం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం నగరాల్లో ఆన్‌లైన్ డెలివరీ, రవాణా, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో లక్షలాది మంది గిగ్ వర్కర్లు పనిచేస్తున్నారని, వారి శ్రమకు తగిన గుర్తింపు, భద్రత, సంక్షేమం, సామాజిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్ల సమస్యలు, వారి హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వారికి సంఘీభావం తెలిపే లక్ష్యంతో ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏఎస్ రావునగర్ డివిజన్ నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కేశెట్టి ప్రసాద్ పిలుపు నిచ్చారు. డివిజన్‌లోని ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ అభిమానులు సమష్టిగా పాల్గొని కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించి భారీ సంఖ్యలో బైక్ ర్యాలీలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు సంఘీభావం తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఏఎస్ రావు నగర్ డివిజన్ శ్రేణులు ముందుండాలని ఆయన పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం...!

- తాను పనిచేస్తున్న పాఠశాలలోనే కూతురిని చేర్పించిన ఉపాధ్యాయురాలు రమ



కాప్రా, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే విశ్వాసాన్ని చేతల్లో చూపించారు ఓ ఉపాధ్యాయురాలు. తాను పని చేస్తున్న కాప్రాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోనే తన కూతురిని చేర్పించి ఆదర్శంగా నిలిచారు ఉపాధ్యాయురాలు రమ. ప్రభుత్వ విద్యావ్యవస్థపై నమ్మకాన్ని చాటిన ఆమె నిర్ణయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి అభినందించి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన బోధన అందుతుందనే నమ్మకంతో ఉపాధ్యాయురాలు రమ తన కూతురిని అదే పాఠశాలలో చేర్పించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులే తమ పిల్లలను అదే పాఠశాలల్లో చదివించేందుకు ముందుకు రావడం విద్యావ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన విద్యా, నైతిక విలువలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయురాలు రమ తీసుకున్న నిర్ణయం ఇతర ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని, ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, రమ, కావ్య, బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మిడిల్ క్లాసు కష్టాలు..!

హైదరాబాద్: ఒకటో తారీకు జీతం వస్తుంది. ఆ తర్వాత ఈఎంఐ కట్టాలి. క్రెడిట్ కార్డు బిల్లు కట్టాలి.. ఇంటి రెంట్ కట్టాలి. పిల్లల స్కూల్ ఫీజులు కట్టాలి. నెలవారి ఖర్చుకు ఎంతోకొంత ఎకౌంట్లో ఉంచుకోవాలి. ఇవన్నీ చేసిన తర్వాత ఏం మిగులుతుంది..జీతం ఆవగింజంత ఉంటే.. ఖర్చులు మామిడికాయ సైజులో ఉంది. ఇలాంటప్పుడు నాలుగు రాళ్లు వెనక వేయడం కాదు కదా.. కనీసం జీవితాన్ని ముందుకు సాగించడం కూడా కష్టమే. నచ్చినవి తినలేము. ఇష్టమైన వాటిని కొనుగోలు చేయలేము. బాగున్న వాటిని సొంతం చేసుకోలేము. ఊహల్లో బతకడం.. కష్టాలను తిట్టుకోవడం.. ఇదే మిడిల్ క్లాస్ జీవితం..మనదేశంలో పేదవాళ్లు ఒక అంచనాలో బతుకుతారు. డబ్బున్న వాళ్లు కూడా ఒక అంచనాలో బతుకుతారు. కానీ మిడిల్ క్లాస్ వాళ్ళు ఎటువంటి అంచనా వేసుకోలేరు. ఎందుకంటే వాళ్లకు ప్రతి విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతుంటాయి. ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని.. ముందుగానే జాగ్రత్త పడతారు.

సంపాదకీయం

కవితాలోకాన కల్పవల్లి..

తెలుగు భావ కవితా రంగంలో ఆయన ఒక ముఖ్య అధ్యాయం. ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో ముంచిగితేలేలా చేస్తుంది. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి "కృష్ణపక్షం" వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". రేడియాలో లలిత గీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రఖ్యాతి పొందారు.దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్ధాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవానము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే.1929లో రవీంద్ర నాథ్ టాగుర్‌తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది.లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం – కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై , పువ్వులో పువ్వునై , ననులేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై,నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలచిన బిగువటరా, -- మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి ప్రతి రాత్రి వసంత రాత్రి, రానిక నీకోసం, ఆకులో ఆకునై, ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, వగలైతే దొరవేరా, గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మి, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట, ఇది మల్లెల వేళయనీ, మావి చిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో-ఆంధ్ర విశ్వవిద్యాలయం – కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్ళీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు.

విలీన మండలాలకు శాశ్వత న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

చింతూరు లేదా ఎటపాకలో జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరు చేయాలని హైకోర్టు న్యాయమూర్తులకు వినతి

గిరిజనులకు స్థానికంగానే సత్వర న్యాయం అందించాలి.. - న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి







భద్రాచలం, నవంబర్ 13, (తెలంగాణ దిశ) : పోలవరం జిల్లాలోని విలీన మండలాల ప్రజలు, ముఖ్యంగా గిరిజనులు న్యాయస్థానాల విచారణల కోసం సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పనిదినాల నష్టాన్ని నివారించేందుకు స్థానికంగా శాశ్వత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. చింతూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలో లేదా ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్‌తో పాటు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు న్యాయవాదుల ప్రతినిధి బృందం వినతిపత్రాలు సమర్పించింది. చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్ పురం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి ఈ ప్రాంతంలో శాశ్వత న్యాయస్థానం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని న్యాయవాదులు వివరించారు. కేసుల విచారణ కోసం కక్షిదారులు, సాక్షులు, గిరిజనులు, న్యాయవాదులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

దీనివల్ల ప్రయాణ ఖర్చులతో పాటు రోజువారీ కూలీ పనులను కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. స్థానికంగా కోర్టు అందుబాటులో లేకపోవడం వల్ల కేసుల విచారణలోనూ జాప్యం జరుగుతోందని, ముఖ్యంగా మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు న్యాయ సేవలు చేరువ కావడం కష్టంగా మారిందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

గిరిజనుల గడప వద్దకే న్యాయం

నాలుగు విలీన మండలాలకు రవాణా సౌకర్యం ఉన్న చింతూరు లేదా ఎటపాకలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును శాశ్వతంగా మంజూరు చేయాలని న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. స్థానికంగా న్యాయస్థానం ఏర్పాటు చేస్తే ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు కేసుల విచారణ వేగవంతమవుతుందని తెలిపారు. ముఖ్యంగా గిరిజనులు తమ హక్కుల పరిరక్షణ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే న్యాయ సేవలు పొందే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. న్యాయస్థానం ఏర్పాటు విషయంలో ప్రభుత్వం, న్యాయశాఖ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలి

జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ పిలుపు - నాలుగవ సారి యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నీలం పద్మ నియామకం



హైదరాబాద్, నవంబర్ 13 (తెలంగాణ దిశ) :
మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ పిలుపునిచ్చారు. మహిళలను రాజకీయంగా చైతన్యవంతులను చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలిగా నాలుగవ సారి నియమితులైన నీలం పద్మకు జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ, రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణల చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు.

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కమలాక్షి రాజన్న, మయూరి సింగ్ ల సమక్షంలో నీలం పద్మకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అల్కాలంబ మాట్లాడుతూ గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో మహిళా కాంగ్రెస్‌కు పటిష్టమైన నాయకత్వాన్ని నిర్మించాలని సూచించారు. మహిళా కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు వివరించడంతో పాటు వారి సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దడంలో నీలం పద్మ తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని ఆకాంక్షించారు. మహిళా కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీ అప్పగించే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నీలం పద్మ మాట్లాడుతూ తనకు గతంలో జడ్పీటీసీగా, ఉమ్మడి నల్గొండ జిల్లా శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి సమన్వయకర్తగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. తనపై విశ్వాసం ఉంచి మరోసారి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షురాలు అల్కాలంబ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు మహిళా కార్యకర్తలను సంఘటితం చేసి పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొస్తానని పద్మ తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, రాజకీయ ప్రాతినిధ్యం పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

బహుజన చైతన్యానికి ముప్పు.. ఐక్యతే ఆయుధం!

కుల అసమానతలు, అణచివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనల చరిత్రే భారత సామాజిక చరిత్ర. ప్రతి సామాజిక న్యాయ ఉద్యమం సమాజాన్ని ముందుకు నడిపించినప్పటికీ, దానికి ప్రతి స్పందనగా ఆధిపత్య రాజకీయాలు కొత్త రూపాల్లో పునరావృతమవుతూనే ఉన్నాయి.. నేడు కూడా ఒకవైపు రాజ్యాంగ విలువలు, సమాన హక్కులు, ప్రాతినిధ్యం కోసం బహుజన పోరాటాలు కొనసాగుతుండగా, మరోవైపు వాటిని నిర్వీర్యం చేసే శక్తులు వివిధ రూపాల్లో పనిచేస్తున్నాయి. రాజ్యాంగ విలువలతో సాగిన నీట్ పరీక్ష లీకేజీ ఉద్యమం దేశ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించి ప్రభుత్వాన్ని కదిలించింది. ఈ ఉద్యమం ఒక దళితుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో, ఒక ఆదివాసీ సోనమ్ వాంగ్ చుక్ స్ఫూర్తితో ప్రజ్వరిల్లింది. దీనికి ప్రతిఘాతకంగా ఇటీవల "రిజర్వేషన్ హఠావో ఆందోళన్" పేరుతో డిజిటల్ ఉద్యమం మొదలైంది. కుల ఆధారిత రిజర్వేషన్లను రద్దు చేసి, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆర్థిక ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.. దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే.. ఇప్పటివరకు ఈ సంఘటనలు రెండుసార్లు మాత్రమే జరిగాయి. ఉదాహరణకు ఒకటి 1950 రాజ్యాంగం అమలులోకి రావడంతో అగ్రకులాలు తమ అదనపు హక్కులు కోల్పోతున్నామని భావించి, ఎన్.డి. తివారి నాయకత్వంలో రాజ్యాంగాన్ని కాల్చి నిరసనకు దిగారు.. వేల సంఖ్యలో పార్లమెంట్ ముందు ధర్నాకు దిగారు.. రెండోది 1990లో మండల్ కమిషన్ అమలుకు వ్యతిరేకంగా కమండల్ పేరుతో దేశవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. బీసీ రిజర్వేషన్ అమలును వ్యతిరేకించారు. ఈ రెండు సందర్భాల్లోనూ బహుజనులకు భారత రాజ్యాంగం హక్కులైన విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దగ్గరవడమే ప్రధాన కారణం. దేశంలో ఇంకా కొనసాగుతున్న కుల వివక్ష, సామాజిక అసమానతలను విస్మరించి రిజర్వేషన్లను రద్దు చేయాలన్న డిమాండ్ న్యాయబద్ధమేనా? నేడు దేశం ముందున్న అత్యంత కీలకమైన ప్రశ్న. రిజర్వేషన్లు తొలగిస్తే కుల వివక్ష తొలగి పోతుందా? లేక వేల ఏళ్లుగా అణచివేతకు గురైన వర్గాలు మరోసారి అదే చీకట్లోకి నెట్టబడతాయా? అనేది ప్రశ్న. అయితే, శతాబ్దాలుగా కుల ఆధిపత్యాన్ని కొనసాగించినవారే ఇప్పుడు 'రిజర్వేషన్ హఠావో' అనడం అట్టడుగు వర్గాల అవకాశాలను, చైతన్యాన్ని బలహీనపరచడానికి కుట్ర చేస్తూ ప్రజా ఉద్యమంగా మలిచే ప్రయత్నం చేస్తున్నారు.. ఈ క్రమంలో రిజర్వేషన్ హఠావో ఉద్యమం సమానత్వానికా? ఆధిపత్యానికా ? అనే ప్రశ్నలు మేధావుల్లో తలెత్తుతున్నాయి. బహుజన యువత నాయకత్వంలో సీజేపీ ఉద్యమ విజయాన్ని ఓర్చుకోలేక అగ్ర వర్ణాలు "రిజర్వేషన్ హటావో" నినాదాన్నీ ముందుకు తేవడం గమనార్హం. అగ్రకులాల తెరపైకి తీసుకొచ్చి కృత్రిమ ఉద్యమం ఇది. ఇది కేవలం రిజర్వేషన్లపై వివాదం కాదు, శతాబ్దాల ఆధిపత్యానికి సబ్బండ కులాల చైతన్యం విసిరిన సవాల్. ఈ నేపథ్యంలో అణగారిన వర్గాల ఐక్యత ఎంత బలపడితే, ప్రతి ఘటన అంత తీవ్రంగా ఉంటుందనే చారిత్రక సత్యాన్ని ఈ పరిణామాలు మరోసారి స్పష్టం చేస్తున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్స్ దానం కాదు, దయ కాదు, మెరిట్‌కు వ్యతిరేకమైనవి కూడా కాదు.. న్యాయ మైన అవకాశాలను కల్పించే ఈక్విటీ (సమన్యాయం) సూత్రం. చారిత్రకంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు సమాన స్థాయిలో పోటీపడే పరిస్థితులను కల్పిస్తుంది. శివుని సమానత్వం, బసవేశ్వరుని సమానత్వం కూడా ఇందులో ఇమిడి ఉంది. ప్రతి తలను లెక్కించి, ప్రతి ఒక్కరికీ సమాన వాటా దక్కేలా చేయడమే భారత రాజ్యాంగ గణతంత్ర స్ఫూర్తి. కానీ ఇప్పటికీ జనాభా దామాషా ప్రకారం సమాన అవకాశాలకు నోచుకొని అట్టడుగు కులాలెన్నో ఉన్నాయి.. మెజారిటీ భూమి, సంపద, అధికారం ఇప్పటికీ కొన్ని కులాల చేతుల్లోనే ఉన్నప్పటికీ.. దాడి మాత్రం దళిత?బహుజనుల రిజర్వేషన్లపైనే ఇదెక్కడి సామాజిక న్యాయం? ఇది ప్రజాస్వామ్యం కాదు.. కులస్వామ్యమే. ఇప్పుడు'"రిజర్వేషన్ హఠావో ఆందోళన్" బహుజన హక్కులను బలహీనపరిచి, వారి చైతన్యాన్ని దారి మళ్లించే అగ్రకుల రాజకీయమే అని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో?ఏర్పడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సాగుతున్న 90 శాతం రిజర్వేషన్ల ఉద్యమం సామాజిక న్యాయానికి దిక్సూచి. సమ సమాజం, సమానత్వం అని నినదించే కమ్యూనిస్టు, నక్సలైట్ ఉద్యమాలు సైతం సామాజిక న్యాయ సాధనలో విఫలమయ్యాయి.. సమాజాన్ని ముందుకు నడిపేది ఆధిపత్య రాజకీయాలు కాదు, సమాన అవకాశాలే. రిజర్వేషన్లపై చర్చ కూడా అదే దృక్పథంతో సాగాలి. జనాభాలో ఎవరెంతో వారికంత వాటా చెందడమే ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్య స్ఫూర్తి. మెరిట్ పేరుతో బలవంతులే అవకాశాలు కొల్లగొట్టడం ఆటవిక సమా జ లక్షణం. చారిత్రక వెనుకబాటుతనాన్ని అధిగమించి ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన స్థానం కల్పించడమే రాజ్యాంగ లక్ష్యం. అగ్రకులాలు ఈ సత్యాన్ని అంగీకరిస్తూ పరివర్తన చెం దాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ విముక్తి కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలు చేస్తున్న పోరాటాలను గౌరవించి మద్దతు ఇవ్వాలి. ఇదే మానవీయత, నిజమైన దేశభక్తి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత అర్థవంతంగా, సమగ్రంగా వికసిస్తుంది.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

- 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న కుటుంబ సంపాదనపరులకు వర్తింపు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించనున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం రూ.5 లక్షల జీవిత బీమా పరిహారం అందించనుందని పేర్కొన్నారు.

18 నుంచి 59 ఏళ్ల వారికి అర్హత

ఈ పథకం కింద కుటుంబంలో సంపాదించే వ్యక్తికి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని కలెక్టర్ తెలిపారు. వయస్సు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదైన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని వివరించారు. అర్హులైన వారు పథకంలో నమోదు చేసుకునేందుకు కుటుంబ పెద్ద వివరాలతో పాటు నామినీ వివరాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

గ్రామ, వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు

అర్హులైన బీమాదారుల నమోదు కోసం గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ప్రక్రియలో లబ్ధిదారుల వివరాలను సేకరించి, నమోదు పూర్తయిన అనంతరం డిజిటల్ సమాచారం, సంతకాలతో కూడిన దరఖాస్తు పత్రాల స్కాన్ ప్రతులను బీమా సంస్థకు పంపిస్తారని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్లెయిమ్ ప్రక్రియ

గ్రామీణ ప్రాంతాల్లో బీమా పొందిన వ్యక్తి మరణించినప్పుడు గ్రామ పంచాయతీ కార్యదర్శి మరణ వివరాలను సేకరించి, సంబంధిత వెబ్ పోర్టల్‌లో నమోదు చేసి మండల పరిషత్ అభివృద్ధి అధికారికి పంపిస్తారు. ఎంపీడీవో క్లెయిమ్ వివరాలను పరిశీలించి ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీఓ)కు పంపిస్తారు. సీపీఓ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదం కోసం సమర్పిస్తారు. కలెక్టర్ ఆమోదించిన క్లెయిమ్‌ను తుది పరిష్కారం కోసం బీమా సంస్థకు పంపిస్తారు. బీమా సంస్థ పరిశీలన, ప్రక్రియ పూర్తిచేసి రూ.5 లక్షల బీమా మొత్తాన్ని నామినీ ఖాతాకు బదిలీ చేస్తుంది.



పట్టణ ప్రాంతాల్లో ఇలా..

మున్సిపాలిటీల పరిధిలో వార్డు అధికారి క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభిస్తారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పరిశీలించి, సీపీఓ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ పరిశీలనకు పంపిస్తారు. వారి పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదంతో బీమా సంస్థకు క్లెయిమ్ చేరుతుంది. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో వార్డు అధికారి క్లెయిమ్‌ను ప్రారంభించి, డిప్యూటీ కమిషనర్ పరిశీలనకు పంపిస్తారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆమోదంతో బీమా సంస్థకు పంపిస్తారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా కుటుంబానికి అండగా నిలిచే సంపాదనపరుడిని కోల్పోయినప్పుడు ఆర్థిక భరోసా లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలు ప్రత్యేక నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకుని పథకంలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కమలంతో ధనుష్..!



చెన్నై: హీరో ధనుష్ రాజకీయాల్లో అడుగు పెట్టేందుకు రోడ్ మ్యాప్ రెడీ చేసుకుంటున్నారు. అయితే ఈ క్రమంలో ఆయనపై అనేక రకాల ఊహాగానాలు రావడానికి ఆయనే చాన్స్ ఇస్తున్నారు. ఎక్కడా రాజకీయం గురించి బయట ప్రకటనలు చేయకపోయినా ఆయన చేసే పనుల్లో గుర్తులు వెదికేస్తున్నారు ఫ్యాన్స్. చెన్నై శివారు సెమ్మంచేరిలోని ఓ ప్రైవేట్ కళాశాల వేదికగా తన 'ధనుష్ నర్పణి ఇయక్కం' మహిళా విభాగం సభ్యులతో ధనుష్ భారీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు మూడు వేల మందికి పైగా మహిళా అభిమానులు తరలివచ్చిన ఈ వేదికపై ఆయన వారితో ఫొటోలు దిగి, దీపావళి కానుకగా వెండి కామాక్షి దీపాలను అందజేసి అభిమానాన్ని చాటుకున్నారు. అయితే అంతవరకు అంతా సజావుగానే సాగినా.. తీరా ఆ వెండి దీపాలను నిశితంగా పరిశీలించిన తర్వాత అసలు కథ మొదలైంది.ఆ వెండి దీపాల అడుగు భాగంలో స్పష్టంగా కమలం పువ్వు ముద్ర ఉండటమే ఇప్పుడు తమిళనాట పెను తుఫానును రేపింది. ధనుష్ ఇచ్చిన గిఫ్ట్‌పై కమలం గుర్తు కనిపించడంతో ధనుష్ వెనుక బీజేపీ ఉందా? ఆయనను బీజేపీ ఏదైనా ప్లాన్-సి గా తెరపైకి తెస్తోందా? అంటూ ఊహాగానాలు ప్రారంభమయ్యాయి.వివాదం ముదురుతుండటంతో అభిమాన సంఘం ప్రతినిధులు హడావుడిగా రంగంలోకి దిగి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. వెండి ప్రమిదలపై ఉన్న కమలం ముద్ర కేవలం ఆ ఆభరణాలను తయారు చేసిన జ్యువెలరీ సంస్థ ట్రేడ్‌మార్క్ స్టాంప్ మాత్రమేనని, దీనికి రాజకీయాలకు సంబంధం లేదని తేల్చిచెప్పారు. కావాలనే కొందరు పనిగట్టుకుని రాజకీయ రంగు పులుముతున్నారని కొట్టిపారేశారు. అయితే రాజకీయ అడుగులు వేయాలని భావిస్తున్న ఒక అగ్ర నటుడు ఇంత సున్నితమైన అంశంలో అంతటి నిర్లక్ష్యంగా ఎలా ఉంటారన్న ప్రశ్నే ఇప్పుడు వినిపిస్తోంది.తమిళనాడు రాజకీయాలు అత్యంత సున్నితమైనవి. అక్కడ ఏ చిన్న సంకేతమైనా క్షణాల్లో తుఫానులా మారుతుంది. మూడు వేల మందికి ఇచ్చే వెండి దీపాలు ఆర్డర్ ఇచ్చి తెప్పించినప్పుడు.. ఆ వస్తువులపై ఏ ముద్రలు ఉన్నాయి? అవి ప్రజల్లోకి వెళ్తే ఎలాంటి సంకేతాలు వెళ్తాయి? అని హీరోగానీ, ఆయన తరఫు పీఆర్ బృందంగానీ ముందుగా చూసుకోకపోవడం వల్ల బీజేపీ ముద్ర పడిపోతోంది. ఆయన ఢిల్లీలో చర్చలు జరిపి వచ్చిన అంశం కూడా ఇక్కడ హాట్ టాపిక్ అవుతోంది.

బాలల హక్కుల పరిరక్షణకు చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- బాలల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు.. - విజేతలకు బహుమతుల ప్రదానం







కుషాయిగూడ, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :బాలల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చట్టాల అమలుతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ఎంతో అవసరమని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్ గోపాల్ రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), బాల సంఘం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యాసరచన, చిత్ర లేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్ తో పాటు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 21-ఎ అధికరణ, విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టాల ప్రాధాన్యతను వివరించారు. బాలలపై జరిగే హింస, దోపిడీ, వివక్ష, బాల కార్మికత్వాన్ని అరికట్టేందుకు ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా బాధ్యత వహించాలని పిలుపు నిచ్చారు. ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బాల సంఘం జాతీయ సమన్వయకర్త కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలు కల్పించాలన్నారు. బాల్యం పనుల కోసం కాదని, చదువులు, ఆటపాటలు, సృజనాత్మకతకు వేదిక కావాలని పేర్కొన్నారు. భగత్‌సింగ్ ఆశయాల స్ఫూర్తితో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సమానత్వ భావన, సామాజిక బాధ్యతను పెంపొందించడమే బాల సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గిరిబాబు, బాల సంఘం జిల్లా సమన్వయకర్త రాజ్‌కుమార్, నాయకులు కిరణ్, శేఖర్, నదీమ్, ఇంతియాజ్, ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల అధ్యక్షుడు అజీమ్ పాషా, కార్యదర్శి మహేష్ బాబుతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ షెడ్డు నిర్మాణానికి చైన్‌మెన్ అండదండలు...!

- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

- నిర్మాణ పనులు ఆపేదెవరు...?

- చీర్యాలలో అక్రమ నిర్మాణంపై క్షేత్రస్థాయి సిబ్బంది తీరుపై స్థానికుల ఆగ్రహం



కీసర, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :కీసర సర్కిల్ పరిధిలోని చీర్యాలలో క్రికెట్ గ్రౌండ్ సమీపంలో చేపడుతున్న అక్రమ షెడ్డు నిర్మాణం వివాదాస్పదంగా మారింది. నిర్మాణంపై ఇప్పటికే అనేక కథనాలు వెలువడుతున్నప్పటికీ, సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ నిర్మాణ పనులు కొనసాగేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదరు షెడ్డు నిర్మాణానికి సంబంధించి కీసర సర్కిల్‌కు చెందిన ఓ చైన్‌మెన్ కీలకంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు నిలిపివేయాల్సిన బాధ్యత ఉన్న సిబ్బందే, పనులు త్వరగా పూర్తి చేసుకోవాలంటూ నిర్మాణదారుడికి సూచనలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నా, సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు, షెడ్డు నిర్మాణానికి అనుమతులు ఉన్నాయని నిర్మాణ యజమాని అబద్ధాలు చెబుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. అయితే సదరు నిర్మాణానికి సంబంధించిన అనుమతులు ఏ శాఖ నుంచి పొందారు..? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే జరుగుతోందా..? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.డీసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణలోనే ఇలాంటి నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ పలు అక్రమ షెడ్లు, నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం అమలు చేయకపోతే క్షేత్ర స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకునేదేవరు..అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చీర్యాల క్రికెట్ గ్రౌండ్ పరిధిలో జరుగుతున్న షెడ్డు నిర్మాణంపై ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై న్యాయ విజ్ఞాన సదస్సు

- బాలల హక్కులు, విద్య, భద్రతపై విద్యార్థులకు అవగాహన







కుషాయిగూడ, నవంబర్ 13, (తెలంగాణ దిశ):బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంక్షేమం, విద్యా ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించే లక్ష్యంతో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి వి. బాల బాస్కర్ రావు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంజివిఎస్ఎల్. ప్రియాంక ఆధ్వర్యంలో నవంబర్ 14న నిర్వహించనున్న బాలల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా నవంబర్ 13న కుషాయిగూడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల, కుషాయిగూడలో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా హక్కుల చట్టం, బాలల వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో), 2012, బాలల సంక్షేమం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాలపై న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. బాలలపై జరిగే హింస, వేధింపులు, వివక్ష వంటి సమస్యలను గుర్తించడం, వాటి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలి, హక్కులకు భంగం కలిగినప్పుడు ఎవరిని సంప్రదించాలి అనే అంశాలను వివరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాల్యాన్ని కాపాడుతూ ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, స్కూల్ సిబ్బంది, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు ఇలాంటి న్యాయ విజ్ఞాన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

న్యూ విరాట్ నగర్‌లో రూ.9 లక్షలతో వాటర్ లైన్ పనులకు శంకుస్థాపన

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



చర్లపల్లి, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపా యాల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని న్యూ విరాట్ నగర్‌లో స్థానిక ప్రజల సౌకర్యార్థం రూ. 9 లక్షల నిధులతో చేపట్టనున్న తాగునీటి సరఫరా పైప్‌లైన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్ తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



కన్నుల పండువగా అయ్యప్ప స్వామి పడి పూజ





కుత్బుల్లాపూర్, నవంబర్ 13 (తెలంగాణ దిశ) :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్‌లో అయ్యప్ప ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పడిపూజ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వామి భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చామంతి పూలతో లాభాల బాట..



నిజామాబాద్, : మారుతున్న కాలానికి అనుగుణంగా, సంప్రదాయ పంటల సాగుతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ప్రత్యామ్నాయ, లాభసాటి పంటల వైపు మళ్లుతున్నారు. ఈ కోవలోనే అనంతపురం జిల్లా నార్పల మండలం వెంకటాం గ్రామానికి చెందిన రైతు రఫీ చామంతి పూల సాగులో అనూహ్య విజయం సాధిస్తున్నారు. మార్కెట్ అవసరాలను, పండగల డిమాండ్‌ను అర్థం చేసుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన నిరూపిస్తున్నారు. రైతు రఫీ తనకున్న ఆరు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని రెండు ఎకరాల చొప్పున మూడు భాగాలుగా విభజించారు. ప్రతి విభాగంలో విడతల వారీగా వివిధ రకాల చామంతి పూలను నాటారు. సాధారణంగా చామంతి సాగును జూన్-జులై నెలల్లో ప్రారంభిస్తారు. దీనివల్ల శీతాకాలంలో, కార్తీక మాసం, పెళ్లిళ్ల సీజన్‌లో అధిక దిగుబడులు వస్తాయి. అయితే రఫీ దసరా, దీపావళి, సంక్రాంతి వంటి ప్రధాన పండగల సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని ముందుగానే మొక్కలు నాటారు. దీనివల్ల పండగల సమయంలో పూలకు అధిక గిరాకీ, మంచి ధర లభిస్తున్నాయి.ప్రస్తుతం ఆయన పొలంలో బుల్లెట్ (తెలుపు, పసుపు రకాలు), ఐశ్వర్య, ముస్కిన్ వైట్, పేపర్ ఎల్లో, పేపర్ వైట్, పూర్ణిమా ఎల్లో, పూర్ణిమా వైట్ వంటి వివిధ రకాల చామంతులు సాగవుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల నుండి ఒక్కో మొక్కను రూ. 1.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా, నాటడానికి కలిపి రూ. 2 ఖర్చు అయ్యిందని రఫీ తెలిపారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు కూలీలను పెట్టి మొక్కలను నాటించారు. మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు దూరం ఉండేలా జాగ్రత్త పడ్డారు. మొక్కలు నాటిన ఐదు నెలలకు దిగుబడి ప్రారంభమవుతుంది. సాగులో భాగంగా ఎరువులు, పురుగుమందుల వాడకంలో రఫీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొదట డీఏపీ, ఆ తర్వాత ట్రిపుల్ 8, ట్రిపుల్ 28 వంటి ఎరువులను ఉపయోగిస్తారు. డ్రిప్ ద్వారా 13-45-13, 12-0-61 వంటి వాటిని అందిస్తూ, మధ్యమధ్యలో న్యూట్రియెంట్స్, ఫార్ములా 6, హ్యూమిక్ పౌడర్ వంటి వాటిని కూడా వాడుతున్నారు. చామంతి పూలకు సాధారణంగా మొగ్గ వచ్చే వరకు తెగుళ్లు పెద్దగా రావు, కానీ మొగ్గ వచ్చిన తర్వాత పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుందని, వాటి నివారణకు అవసరమైన మందులను వాడుతున్నామని రఫీ వివరించారు.చామంతి పూల కోత సుమారు రెండు నెలల పాటు నిరంతరం కొనసాగుతుంది, ఆ తర్వాత మూడో నెలలో దిగుబడి కాస్త తగ్గుతుంది. మొదటి కోతలోనే రెండు ఎకరాల నుంచి ఒక టన్ను పూలు వచ్చాయని, కిలో రూ. 200 చొప్పున రూ. 2 లక్షల ఆదాయం వచ్చిందని రఫీ తెలిపారు. మొత్తం పెట్టుబడి మొక్కలు నాటినప్పటి నుంచి రూ. 2.25 లక్షలు అయ్యిందని, మొదటి కోతతో పెట్టుబడి వెనక్కి వచ్చి, రెండో కోత నుంచి లాభాలు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ విషయానికొస్తే, ఉదయం కోసిన పూలను అనంతపురం మార్కెట్‌కు, సాయంత్రం కోసిన పూలను బెంగళూరు, చెన్నై, మైసూరు వంటి పెద్ద నగరాలకు పంపిస్తారు. వ్యాపారులు స్వయంగా పొలానికి వచ్చి పూలను కొనుగోలు చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నాణ్యత ఆధారంగా ధరలు మారుతాయని, మొదటి నాణ్యత పూలకు రూ. 275, రెండో నాణ్యతకు రూ. 150, మూడో నాణ్యతకు రూ. 100 వరకు ధర లభిస్తుందని వివరించారు. ఏ పంట అయినా సరే, నాణ్యత ఉంటేనే లాభాలు వస్తాయని, లేకపోతే పంట వ్యర్థమని రఫీ స్పష్టం చేస్తున్నారు. ఎప్పుడూ ఒకే పంట వేయకుండా, వినూత్నంగా ఆలోచిస్తూ, మార్కెట్‌కు అనుగుణంగా పంటలను ఎంచుకుంటే లాభాలు వాటంతట అవే వస్తాయని రైతు రఫీ తన అనుభవంతో నిరూపిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో భారీ యూరియా కర్మాగారం ఏర్పాటుకు సన్నాహాలు

- క్రిభ్కో, గెయిల్, ఏపీఈడీబీ మధ్య అవగాహన ఒప్పందం
- ఏడాదికి 12.7 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి లక్ష్యం





విశాఖపట్నం, నవంబర్ 13, (తెలంగాణ దిశ) :ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్ ఆధారిత భారీ యూరియా కర్మాగారం ఏర్పాటుకు క్రిషక్ భారతి కోఆపరేటివ్ లిమిటెడ్ (క్రిభ్కో), గెయిల్ (ఇండియా) లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గెయిల్ శ్రీకాకుళం- అంగుల్ సహజవాయువు పైప్‌లైన్ సమీపంలో ఈ కర్మాగారాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించనున్నారు. ఏటా 12.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి సామర్థ్యంతో దీనిని ప్రతిపాదించారు. ఒప్పందంపై క్రిభ్కో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిఎస్. ఆజాద్, గెయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్, ఏపీఈడీబీ సీఈవో సాగిలి షాన్‌మోహన్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో క్రిభ్కో చైర్మన్ వి. సుధాకర్ చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎస్.యాదవ్, గెయిల్ డైరెక్టర్ ఆర్‌కె. సింఘాల్ పాల్గొన్నారు. దేశీయంగా ఎరువుల ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడటం ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలని సంస్థలు వెల్లడించాయి.

సర్కార్ వారి రైడింగ్ యాప్..



హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు, ఆటో డ్రైవర్లకు శుభవార్త అందించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ప్రధాన నగరాల్లో ర్యాపిడో, ఉబర్, ఓలా లాంటి బైక్, ఆటో క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ ప్రైవేట్ యాప్స్‌లో ధరలు అధికంగా ఉండటంతో పాటు రిజిస్టర్ చేసుకుని సేవలు అందించేవారి నుంచి అధిక కమీషన్లు వసూలు చేస్తున్నారు. దీంతో ప్రజలతో పాటు ఆటో డ్రైవర్లకు కూడా నష్టం జరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ ధరకే ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందించడంతో పాటు కమీషన్ల భారం నుంచి ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వమే సొంతగా ఒక యాప్ తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. త్వరలో ఈ యాప్ ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.ఓలా, ఉబర్, ర్యాపిడో లాంటి ప్రైవేట్ అగ్రిగేటర్ల యాప్‌ల తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలపై చర్చించారు. డ్రైవర్లతో పాటు ఇతర కార్మికుల భద్రత కోసం ఇన్సూరెన్స్ పాలసీని అమలు చేయడంపై ప్రభుత్వం సమాలోచనలు చేస్తోందని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం, ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా ప్రభుత్వం తరపున ప్రత్యేక రైడ్ హేలింగ్ యాప్ తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా అత్యంత తక్కువ ధరల్లో ప్రజలకు క్యాబ్ సర్వీసులు అందిస్తామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లకు కమిషన్ల భారం కూడా తగ్గి వారికి ప్రయోజనం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టినట్లు తెలిపారు.సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి అనంతరం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలను పెంచలేదని, ప్రస్తుతం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆటో కార్మికుల సంఘాలు, రవాణాశాఖ అధికారులతో ఛార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎంత పెంచాలనే దానిపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి త్వరలో నివేదిక సమర్పించనుందని, ఆ నివేదిక పరిశీలించాక ఎంత పెంచాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టనున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం అలాంటి ఆలోచన ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు.

రుణపరిమితి పెంచడం సాధ్యమేనా?




హైదరాబాద్, : తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్‌నినో రూపంలో ఊహించని ప్రకృతి, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి నిల్వలు క్షీణించి భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడంతో, క్షేత్రస్థాయిలో వ్యవసాయం దెబ్బతింటోంది. మరోవైపు సాగునీటి పంపింగ్ కోసం వ్యవసాయ విద్యుత్ వినియోగంతో పాటు పగటి ఉష్ణోగ్రతల వల్ల గృహ వినియోగం అనూహ్యంగా పెరిగింది. రైతులకు రెండో పంట వేసుకునే అవకాశం తగ్గడం వల్ల పంటల నష్టం వేల కోట్లకు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఇటు విద్యుత్ కొనుగోళ్లకు అదనపు భారం పడటం, అటు నష్టపోతున్న వర్గాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ కిట్ వంటి సంక్షేమ పథకాలు అమల్లోకి తెస్తుండటంతో ప్రభుత్వ ఖజానాపై ఊహించని భారం పడుతోంది.ఈ అదనపు ఖర్చులను తట్టుకునేందుకు మరియు హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు నిధులు అత్యవసరంగా మారాయి. అయితే, రాష్ట్ర సొంత ఆదాయం సరిపోకపోవడంతో మార్కెట్ రుణాల ద్వారా నిధులను సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం విధించే ఎఫ్ఆర్‌బీఎమ్ రుణ పరిమితిని పెంపుదల చేయాలని తెలంగాణ సర్కార్ కేంద్రాన్ని కోరేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం జీఎస్‌డీపీలో 3 శాతంగా ఉన్న రుణ పరిమితిని కనీసం 4 నుంచి 4.5 శాతానికి పెంపు చేయాలని విజ్ఞప్తి చేస్తోందిగతం నుంచి వస్తున్న అనుభవాలు, ఆర్థిక నియమావళి భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. సాధారణంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కఠినమైన ద్రవ్య లోటు లక్ష్యాలను అనుసరిస్తుంది. గతంలో కోవిడ్ మహమ్మారి లేదా తీవ్రమైన జాతీయ విపత్తుల సమయంలో మాత్రమే అన్ని రాష్ట్రాలకు సడలింపులు ఇచ్చింది. ఎల్‌నినో వల్ల కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభావం ఉంటుంది కాబట్టి, ఒకే రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి పెంచడం కేంద్రానికి నిబంధనల రీత్యా సులభం కాకపోవచ్చు. కేంద్రం రుణ పరిమితి పెంచాలంటే కొన్ని షరతులు విధించే అవకాశం ఉంది. ఉదాహరణకు, గతంలో విద్యుత్ రంగ సంస్కరణలు అమలు చేయడం , పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తి పన్ను సంస్కరణలు చేపట్టడం వంటి నిబంధనలు తీర్చినప్పుడే అదనంగా 0.5% బిజినెస్ రారో ఆప్షన్ ఇచ్చేవారు. రేవంత్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ విధానానికి కట్టుబడి ఉన్నందున, కేంద్రం విధించే విద్యుత్ సంస్కరణలకు అంగీకరించడం రాజకీయంగా పెద్ద సవాలుగా మారుతుంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో ప్రతిపక్ష హోదాలో తీవ్ర పోటీనిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తగినన్ని సంస్కరణలు చేయకుండా లేదా ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా రుణాలు పెంచుకోవడానికి అనుమతినిస్తే, దానికి బాధ్యత వహించాల్సి వస్తుందనే ఆలోచనలో కేంద్ర ఆర్థిక శాఖ ఉంది. బిఆర్ఎస్ హయాంలో చేసిన భారీ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తున్న తరుణంలో, కొత్తగా అప్పుల పరిమితి పెంచే విషయంలో కేంద్రం వెనుకాడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేంద్రం ఎఫ్ఆర్‌బీఎమ్ పెంపుకు నిరాకరిస్తే, రేవంత్ సర్కార్ ముందు ప్రత్యామ్నాయ మార్గాలు పరిమితంగానే ఉన్నాయి. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ ను తగ్గించుకోవడం, నాన్-టాక్స్ రెవెన్యూ పెంచుకోవడం లేదా సంక్షేమ పథకాల అమలును దశలవారీగా వేగవంతం చేయడం తప్ప వేరే మార్గం ఉండదు. కరెంట్ సర్దుబాటు కోసం విద్యుత్ సంస్థలపై డిస్కం లోన్లు పెంచే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, అది కూడా తాత్కాలిక ఉపశమనమే అవుతుంది. ఎల్‌నినో సృష్టించిన నీటి, విద్యుత్ సంక్షోభం నుంచి బయటపడటానికి ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి పెంపు అనేది తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత తక్షణ అవసరమే.

క్యూర్ కు 28 శాతం మార్కులే

హైదరాబాద్ : 70 ఏళ్ల చరిత్ర కలిగిన జీహెచ్ఎంసీ చట్టం స్థానంలో తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'క్యూర్' ముసాయిదా బిల్లు మహానగర పాలనా సంస్కరణల విషయంలో ఆశించిన స్థాయిలో లేదని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా పని చేసే పాలనా అధ్యయన సంస్థ 'జనాగ్రహ' నిర్వహించిన సమీక్షలో ఈ ముసాయిదాకు కేవలం 28 శాతం మార్కులే లభించాయి. పొరుగు రాష్ట్రమైన కర్ణాటక తీసుకొచ్చిన 'గ్రేటర్ బెంగళూరు అథారిటీ' (జీబీఏ చట్టం 2024) సాధించిన 38 శాతంతో పోలిస్తే.. హైదరాబాద్ కోసం ప్రతిపాదించిన ఈ బిల్లు సంస్కరణల పరంగా వెనుకబడి ఉందని సదరు అధ్యయనం ఎత్తిచూపింది. హైదరాబాద్ నగరాన్ని సమగ్రమైన ఏకైక అర్బన్ రీజియన్‌గా ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దేందుకు ఒక అధికారిక ఏకీకృత వ్యవస్థ లేకపోవడమే ఈ బిల్లులోని ప్రధాన లోపంగా విశ్లేషణ పేర్కొంది. ప్రస్తుతం రవాణా, గృహ నిర్మాణం, మురుగునీటి పారుదల, భూ వినియోగం వంటి కీలకమైన బాధ్యతలను వివిధ ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఎవరికి వారే స్వతంత్రంగా నిర్వహిస్తున్నాయని నివేదిక తెలిపింది. వేర్వేరు సంస్థల మధ్య అనుసంధానం లోపించడంతో నగర అభివృద్ధి ప్రణాళికలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోతున్నాయని స్పష్టం చేసింది.నగర పాలన సమర్థవంతంగా సాగాలంటే ప్రజలు ఎన్నుకున్న స్థానిక ప్రజాప్రతినిధులకు సమస్యలను తక్షణమే పరిష్కరించే అసలైన అధికారాలు ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ బిల్లు ద్వారా మేయర్, కౌన్సిల్‌ల అధికారాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని.. నైబర్‌హుడ్ పరిధిలోని నిర్ణయాల్లో స్థానిక పౌరులకు భాగస్వామ్యం కల్పించేలా స్పష్టమైన నిబంధనలు చేర్చాలని సూచించారు. నగర పరిపాలనా వ్యవస్థను నిరంతరం జవాబుదారీగా ఉంచేందుకు స్వతంత్ర పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. మెట్రోపాలిటన్ ప్లానింగ్ కమిటీ (ఎంపీసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), ముఖ్యమంత్రి అధ్యక్షతన ఉండే అత్యున్నత పాలనా మండలి విధుల మధ్య ఎలాంటి పునరావృతం లేకుండా స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.బృహత్తర నగరాల నిర్వహణలో భారత దేశంలోనే హైదరాబాద్ ఒక మార్గదర్శక మహానగర పాలనా నమూనాగా ఎదిగేందుకు గొప్ప అవకాశం ఉందని జనాగ్రహ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీకాంత్ విశ్వనాథన్ అభిప్రాయ పడ్డారు. అత్యున్నత పాలనా మండలి సజావుగా పని చేసేందుకు ఒక పూర్తిస్థాయి సచివాలయాన్ని ఏర్పాటు చేయాలని, అలాగే నగర ప్రాధాన్యతలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు హైదరాబాద్ వ్యవహారాల మంత్రి వంటి ప్రత్యేక రాజకీయ బాధ్యుడిని నియమించాలని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణలోనూ కూటమి...

నల్గొండ, : ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం రాజకీయంగా తీవ్ర ఆసక్తి రేపుతోంది. ఈ స్థానానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముందస్తుగానే మాజీ హెల్త్ డైరెక్టర్, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా ప్రకటించి ప్రచారంలోకి దింపారు. ఇప్పుడు తమ అభ్యర్థికి మద్దతివ్వాలని జనసేన పార్టీ బీజేపీని కోరుతోంది. తెలంగాణలో తాము సొంతంగానే బరిలోకి దిగుతామని, స్థానికంగా పొత్తులు ఉండవని బీజేపీ రాష్ట్ర నాయకులు పైకి ఎంతగా చెబుతున్నప్పటికీ.. జాతీయ స్థాయిలో ఎన్డీయే మిత్రపక్షంగా ఉన్న జనసేన ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించలేని పరిస్థితిలో కమలనాథులు పడిపోయినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది.ఇటీవల బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జుల సమక్షంలో జరిగిన ముఖ్యనేతల భేటీలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పొత్తు అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. జనసేనతో అధికారికంగా పొత్తు పెట్టుకుంటే ప్రత్యర్థి పార్టీలు స్థానిక సెంటిమెంట్‌ను అస్త్రంగా చేసుకుంటాయనే ఆందోళనను కొంతమంది రాష్ట్ర నేతలు వ్యక్తం చేసినప్పటికీ.. జాతీయ అధిష్ఠానం స్థాయిలో ఉన్న సమీకరణాల రీత్యా జనసేనను ఆమోదించక తప్పదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే బీజేపీ ఆశావహుల తుది జాబితాతో పాటు జనసేన అభ్యర్థి గడల శ్రీనివాసరావు పేరును కూడా జాతీయ నాయకత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది.వైద్యశాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు గ్రాడ్యుయేట్లు, ఉద్యోగ వర్గాల్లో ఉన్న పరిచయాలు, సామాజిక వర్గ సమీకరణలు ఈ స్థానంలో సానుకూల అంశాలుగా మారుతున్నాయి. అంతేకాకుండా



పవన్ కళ్యాణ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి వ్యూహాత్మకంగా నియోజకవర్గ సమన్వయకర్తలను సైతం నియమించడంతో జనసేన ప్రచారం ఇప్పటికే వేగవంతమైంది. బీజేపీ తరఫున రేసులో ఉన్న ఇతర ఆశావహుల కంటే గడల శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో ముందంజలో ఉండటం వల్ల, నేరుగా కాకపోయినా పరోక్షంగానైనా ఆయనకు మద్దతు ఇవ్వడమే లాభదాయకమని కమలదళం భావిస్తున్నట్లు తెలుస్తోంది.తెలంగాణలో సొంతంగా బలపడాలని బీజేపీ ప్రయత్నిస్తున్నప్పటికీ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలో జనసేనను తెలంగాణలో ఒంటరిని చేయడం సమంజసం కాదని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పొత్తులు ఉండవు అని పైకి గంభీర ప్రకటనలు చేస్తున్నప్పటికీ, అంతర్గతంగా గడల శ్రీనివాసరావుకే మద్దతు పలకక తప్పని పరిస్థితి ఏర్పడింది. చివరకు బీజేపీ-జనసేనల మధ్య ఈ స్థానంపై అవగాహన కుదిరితే, ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల పోరు మరింత ఉత్కంఠభరితంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

ట్రాన్స్ జెండర్లకు లోకల్ బాడీస్ లో రిజర్వేషన్

హైదరాబాద్ : హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా నకిలీ హిజ్రాలు, క్రాస్ డ్రెస్సర్లు శుభకార్యాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి బరితెగించి దందాలు చేయడం, అసభ్యకర ప్రవర్తనతో బెదిరించి డబ్బులు వసూలు చేయడంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అదే సమయంలో, సమాజంలో వివక్షకు గురవుతున్న నిజమైన ట్రాన్స్‌జెండర్లను నేర మార్గం లేదా భిక్షాటన నుంచి బయటకు తీసి, వారిని గౌరవప్రదమైన వ్యవస్థలో భాగస్వాములను చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. కేవలం పోలీసుల లాఠీలతో శాంతిభద్రతల సమస్యను తీర్చడమే కాకుండా, వారికి రాజకీయ, సామాజిక సాధికారత కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.ట్రాన్స్‌జెండర్ల సాధికారతలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఒక విప్లవాత్మక బిల్లుకు ఆమోదముద్ర వేసింది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 కి అవసరమైన కీలక సవరణలు చేస్తూ తెలంగాణ మున్సిపాలిటీల సవరణ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నూతన చట్ట సవరణ ప్రకారం.. హైదరాబాద్ నగరానికి సంబంధించి కోర్ అర్బన్ రీజియన్ వెలుపల ఉన్న రాష్ట్రంలోని 9 ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం వంటి కార్పొరేషన్లలలో ట్రాన్స్‌జెండర్లకు స్థానిక పాలనలో అవకాశం కల్పిస్తారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక ట్రాన్స్‌జెండర్‌ను కో-ఆప్షన్ సభ్యుడిగా ప్రభుత్వం నేరుగా నామినేట్ చేయనుంది.స్థానిక ప్రభుత్వాల చట్టాల్లో ఒక సామాజిక వర్గానికి, అదీ ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్లకు



కౌన్సిల్స్ లేదా కార్పొరేషన్లలో చట్టబద్ధంగా కో-ఆప్షన్ సభ్యత్వాలు కల్పించడం భారతదేశంలోనే ఇది మొదటిసారి. నిర్ణయాధికారం ఉన్న స్థానిక పాలకమండళ్లలో వారు కూర్చోవడం ద్వారా తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న ఆవాస, విద్యా, ఆరోగ్య సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది. ఉనికి కోల్పోయిన వర్గానికి చట్టసభలు, పాలనా వ్యవస్థల్లో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పాలనా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.కేవలం రాజకీయ ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల తెలంగాణ హైడ్రా వ్యవస్థలో ట్రాన్స్‌జెండర్లను కమాండోలుగా నియమించడం, నిరసనలు, ఆక్రమణల తొలగింపు వేళ వారి సేవలను వాడుకోవడం నగరంలో పెద్ద ట్విస్ట్‌గా మారింది.

సీఎం రేవంత్ రెడ్డి ఆఖరి అస్త్రం.. గులాబీ బాస్ కొత్తవ్యూహం ఏమిటి..?



మెదక్, : కేసీఆర్ సభకు వస్తారు. కానీ సీఎంగానే అసెంబ్లీలో అడుగు పెడుతారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాట ఇది. చిల్లర మాటలు మాట్లాడే వారి ముందుకొచ్చి తాను సభలో పాల్గొనాలా.? అంటూ గులాబీ బాస్ కూడా సభకు రాబోనని తేల్చి చెప్పేశారు. ఇన్నాళ్లు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని డిమాండ్లు చేసినా..ఎన్ని ఎత్తులు వేసినా..ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు చేసిన ప్రయత్నాలేవి ఫలించలేదు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఆఖరి అస్త్రాన్ని బయటికి తీశారన్న ప్రచారం నడుస్తోంది. ఎలాగైనా కేసీఆర్ నోరు తెరిపించాలి.. ఆయనతో వివరణ ఇప్పించాలనేదే రేవంత్ టార్గెట్ అని..అందుకోసం ఏ అవకాశాన్ని ఆయన వదులుకోవడం లేదంటున్నారు.ఆ మాట కొస్తే కొత్త కొత్త పొలిటికల్ వెపన్స్‌ను బయటికి తీస్తూ కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు ఆయన ఫాంహౌస్ ల్యాండ్స్‌లో దళితుల భూమి ఉందంటూ ఏకంగా విచారణకు ఆదేశించారు. ఆల్రెడీ ఎంక్వైరీ జరుగుతోంది. రెవెన్యూ అధికారులు ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. అదంతా అడ్మినిస్ట్రేషన్ ప్రాసెస్ కాగా .. కాంగ్రెస్ ఎంపీలు కేసీఆర్ ఫాంహౌస్ పరిశీలనకు వెళ్లడం మరో రాజకీయ ఎత్తుగడ అన్న టాక్ నడుస్తోంది. ఎంపీలు వెళ్లి అక్కడ చేసేదేం లేదని..జస్ట్ మీడియాలో హైప్ కోసం..కేసీఆర్ ఆస్తులు సంపాదించారని ఎక్స్‌పోజ్ చేసే ఎజెండాలో భాగంగానే ఫాంహౌస్ పర్యటన పెట్టుకున్నారని అంటున్నారు.ప్రతీసారి వన్స్ మోర్ అంటూ కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ చేస్తూ వస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పదేళ్ల పాలనలో తెలంగాణకు బీఆర్ఎస్ ఏం చేసిందో..కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఏం జరిగిందో..అసెంబ్లీలో ప్రజల ముందే చర్చిద్దామంటూ ఆ మధ్య సవాల్ చేశారు రేవంత్. చర్చలో తాను ఓడిపోతే ప్రజలకు క్షమాపణ చెబుతానని..కేసీఆర్ ఓడిపోతే ఫాంహౌస్‌కే పరిమితం అవుతారా అని ఛాలెంజ్ చేసిన సందర్భాలున్నాయి. కేసీఆర్ సభకు వస్తే ఆయన గౌరవానికి భంగం కలగకుండా చూసుకునే బాధ్యత కూడా తనదంటూ చెప్పుకొచ్చారు.ఇదంతా ఓ ఎత్తు అయితే..ఓ వైపు ఫోన్ ట్యాపింగ్ కేసు..ఇంకోవైపు విద్యుత్ కొనుగోళ్లపై విచారణ.. మరోవైపు కాళేశ్వరం దర్యాప్తు..ఇలా రకరకాల ఇష్యూస్‌తో కేసీఆర్ మౌనాన్ని బద్దలు కొట్టే ప్రయత్నం చేశారు సీఎం. అయినా నో కామెంట్ అంటూ సైలెంట్‌గా ఉంటూ వచ్చారు కేసీఆర్. ఫాంహౌస్‌లో నేతలతో భేటీ అయినా..పబ్లిక్ మీటింగ్‌లకు అటెండ్ అయినా..ఎక్కడా రేవంత్ పేరు తీయకుండానే ఈ ప్రభుత్వ పనితీరు బాలేదని..ప్రజలు సంతోషంగా లేరని చెప్పుకొంటూ వస్తున్నారు కేసీఆర్. దీంతో ఇన్నాళ్లు రేవంత్ వేసిన ఎత్తులేవి వర్కౌట్ కాలేదు. ప్రభుత్వం, సీఎం రేవంత్ చేసిన ఏ ఆరోపణపై కేసీఆర్ బయటికి వచ్చి రియాక్ట్ కాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్ ఫైనల్ పంచ్ ఇచ్చేందుకు ఫాంహౌస్ ల్యాండ్స్ చుట్టూ ఎంక్వైరీ అంటూ రచ్చకు తెరలేపారని అంటున్నారు.అధికార పార్టీ నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా..రేవంత్‌రెడ్డి ఎన్నిసార్లు కేసీఆర్‌ను ఉద్దేశించి పర్సనల్ అటాక్ చేసినా..దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాల్ చేసినా..గులాబీ బాస్ రియాక్ట్ అయిన దాఖలాలు లేవు. సీఎం రేవంత్ రెడ్డి పేరును కూడా ప్రస్తావించకుండా కేసీఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ఒపీనియన్స్ ఉన్నాయి. సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు అలిగేషన్స్‌కు సమాధానం చెప్పే బాధ్యతను కేటీఆర్, హరీశ్‌రావులే తీసుకుంటున్నారు. రేవంత్ రెడ్డి స్థాయికి తామే సరిపోతామ్..కేసీఆర్ స్పందించాల్సిన అవసరం లేదని వాళ్లిద్దరే రివర్స్ అటాక్‌కు దిగుతున్నారు.కానీ రేవంత్ టార్గెట్ ఒక్కటే. కేసీఆర్ నోరు తెరిపించాలి. తన పేరు ప్రస్తావించి మాట్లాడే పరిస్థితి తీసుకురావాలి. అన్నింటికి మించి రేవంత్ వర్సెస్ కేసీఆర్ అన్నట్లుగానే తెలంగాణ పొలిటికల్ సినారియోలో డైలాగ్ వార్ కొనసాగాలనేది రేవంత్ మాస్టర్ ప్లాన్ అంటున్నారు. అందుకే సందర్భం దొరికిన ప్రతీసారి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారని అంటున్నారు. సరిగ్గా ఎన్నికలకు ఏడాది ముందు కేసీఆర్ రంగంలోకి దిగాలని..అదే తమ ఎన్నికల అస్త్రమని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే జరిగితే ఎన్నికల్లో కేసీఆర్‌కు సానుభూతి వచ్చే అవకాశం ఉంటుందని..

ఆలోపే కేసీఆర్ నోరు తెరిపించాలని రేవంత్ ప్లాన్ అని అంటున్నారు. దీంతో ఈ ఇద్దరి పోరాటం.. రసవత్తరంగా మారుతోంది.మరి ఈ సారి రేవంత్ వేసిన ల్యాండ్ ఎంక్వైరీపై కేసీఆర్ స్పందిస్తారా.? రేవంత్ ఫైనల్ పంచ్‌కు కేసీఆర్ మౌనం వీడుతారా.? ఇప్పటివరకు అనుసరిస్తున్న వ్యూహాన్నే కొనసాగిస్తారా.? ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది. ఒకవేళ కేసీఆర్ స్పందిస్తే..కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ సమరం కొత్త మలుపు తిరిగే అవకాశం ఉంది. స్పందించకపోతే..బ్లేమ్ గేమ్ వెపన్‌గా మలుచుకునేందుకు హస్తం పార్టీ రెడీ అవుతోంది. రేవంత్ లేవనెత్తిన ఈ ల్యాండ్ లడాయి ఎటు టర్న్ తీసుకుంటుందో చూడాలి మరి.

అభ్యర్థి ఎంపికపై బీఆర్ఎస్ కసరత్తు.. టికెట్ దక్కేదెవరికి..?



హైదరాబాద్, : దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు ఉప ఎన్నిక జరగడం దాదాపు ఖాయమైంది. బీఆర్ఎస్‌లో అప్పుడే ఖైరతాబాద్ బైపోల్‌పై చర్చ మొదలైంది. నిన్నటి వరకు దానం నాగేందర్‌పై పోరాటం చేసిన బీఆర్ఎస్..ఇప్పుడు అదే సీటును తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కసరత్తు స్టార్ట్ చేస్తోంది. అందుకే..అభ్యర్థి ఎంపికపై ఆచితూచి అడుగులు వేయాలని డిసైడ్ అయింది గులాబీ పార్టీ అధిష్టానం. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్న నేతలు.. ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు బిజీ అయిపోయారట.పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన విష్ణుకు..నియోజకవర్గంతో ఉన్న పాత పరిచయాలు, పీజేఆర్ కుటుంబానికి ఉన్న రాజకీయ అనుబంధం తమకు కలిసొస్తుందని బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఖైరతాబాద్‌కు బైపోల్ వస్తే విష్ణువర్ధన్ రెడ్డిని బరిలో దింపే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్లు కూడా ఎప్పటినుంచో ప్రచారం ఉంది.గతంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్సీ దానోజు శ్రవణ్ పేరు కూడా టికెట్ రేసులో వినిపిస్తోంది. గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన శ్రవణ్..ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. నియోజకవర్గంతో ఉన్న అనుబంధంతో పాటు..బీసీ సామాజిక సమీకరణాలు కూడా తనకు అనుకూలంగా మారుతాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక మరో నేత తలసాని సాయికిరణ్ పేరు ఈ రేసులోకి రావడం మరింత ఆసక్తి రేపుతోంది. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ యాదవ్ కూడా ఖైరతాబాద్ టికెట్ ఆశిస్తున్నట్లు టాక్.ఉపఎన్నిక రాబోతుందని ప్రచారం నడుస్తున్నప్పటి నుంచి సాయికిరణ్‌ను బరిలోకి దింపాలని తలసాని ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం నడిచింది. సంక్రాంతి సందర్భంగా ఖైరతాబాద్ పరిధిలో జరిగిన కార్యక్రమాల విషయంలోనూ తలసాని, దానం వర్గాల మధ్య పోటాపోటీ కనిపించిందన్న చర్చ అప్పట్లో జరిగింది. దీంతో ఖైరతాబాద్ ఉపఎన్నికలో తనయుడు సాయికిరణ్‌ను పోటీ చేయించేందుకు తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది.తలసాని సాయికిరణ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కంటెస్ట్ చేసి ఓడిపోయారు.మరోవైపు పార్టీ కోసం చాలాకాలంగా పనిచేస్తున్న మన్నె గోవర్ధన్ రెడ్డి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. 2014లో ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన మన్నె..2018, 2023లో దానం నాగేందర్‌కు అవకాశం ఇవ్వడంతో సీటు త్యాగం చేసి సహకరించారని ఆయన వర్గం చెబుతోంది. విష్ణువర్ధన్‌రెడ్డి..దాసోజు..సాయికిరణ్..మన్నె గోవర్ధన్‌రెడ్డి.. నలుగురి పేర్లు ఇప్పుడు ప్రచారంలో ఉన్నప్పటికీ..ఇక్కడే బీఆర్ఎస్ అసలు కసరత్తు మొదలుపెడుతుందట. ఎవరికి స్థానికంగా బలం ఉంది.? క్యాడర్‌ను నడిపించే సామర్థ్యం ఉన్న లీడర్లు ఎవరు.? సామాజిక సమీకరణాలు ఏంటి.? కాంగ్రెస్ అభ్యర్థిని ఢీకొట్టేందుకు ఎవరైతే సరైన అభ్యర్థి.? ఇలాంటి అంశాలన్నింటినీ పరిశీలించాకే అభ్యర్థిని ఫైనల్ చేయాలని గులాబీ అధిష్టానం భావిస్తోందన్న చర్చ జరుగుతోంది.గత బైపోల్స్ అనుభవాలను కూడా పరిగణనలోకి తీసుకుని..చివరి నిమిషం వరకు అభ్యర్థి ఎంపికపై సర్వేలు, ఫీడ్ బ్యాక్ తీసుకునే అవకాశం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత రెండు బైపోల్స్‌లోనూ అభ్యర్థి విషయంలో చేసిన పొరపాటు ఈ సారి చేయకూడదనే పట్టుదలతో ఉంది గులాబీదళం. ఎమ్మెల్యేల మృతితో వచ్చిన ఎన్నికలు కావడంతో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో అనివార్యంగా వారి కుటుంబసభ్యులకే టికెట్ ఇవ్వాల్సి వచ్చిందని..ఈ సారి గెలుపు గుర్రాన్నే ఎంపిక చేసుకునే అవకాశం ఉందని బీఆర్ఎస్ భావిస్తోంది.కేటీఆర్ ఇప్పటికే దానం నాగేందర్ అనర్హతపై స్పందిస్తూ.. ఖైరతాబాద్ ఉపఎన్నికలో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలకూ ఇదే గతి పడుతుందన్నారు. దీంతో బీఆర్ఎస్‌కు ఖైరతాబాద్ బైపోల్ కేవలం మరో ఎన్నిక కాదనే చర్చ మొదలైంది. ఖైరతాబాద్‌లో గెలిచి అధికార పార్టీకి, జంపింగ్ ఎమ్మెల్యేలకు ఝలక్ ఇవ్వాలని కసి మీదుందట బీఆర్ఎస్. అందుకే క్యాండిడేట్ సెలక్షన్స్ విషయంలో ఒక్క చిన్న తప్పిదం కూడా చేయకూడదని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు టాక్. ఖైరతాబాద్ బరిలో దిగే గులాబీ అభ్యర్థి ఎవరన్నది నోటిఫికేషన్ వస్తే తప్ప క్లారిటీ వచ్చేలా లేదు.

అన్నీ పార్టీలకు సవాలే...!



హైదరాబాద్, : దానం నాగేందర్‌పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి అనివార్యంగా మారే ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు కొత్త ఊపిరి పోస్తుందా లేక మరిన్ని రాజకీయ సమస్యల్లోకి నెడుతుందా అన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పైకి చూస్తే అధికార కాంగ్రెస్‌పై పోరాడేందుకు ఇది ఒక సువర్ణావకాశంలా కనిపించినప్పటికీ, గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాలును విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉపఎన్నికలోనూ సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవన్న విషయం ఆ చేదు ఫలితంతో బీఆర్ఎస్‌కు స్పష్టంగా అర్థమైంది.ఖైరతాబాద్ క్షేత్రస్థాయి సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే ఇక్కడ సంస్థాగతంగా బీఆర్ఎస్ బలం దాదాపు శూన్యమనే చెప్పాలి. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది తప్ప, పార్టీకంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం బలంగా జరగలేదు. దానంకు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచరగణం, స్థానిక బస్తీల్లో ఆయనకున్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్‌లో సంప్రదాయబద్ధంగా ఉన్న పాత ఓటుబ్యాంకు, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ కేడర్, సరైన అభ్యర్థి లేని బీఆర్ఎస్‌కు దానం వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కొని నిలబడటం కత్తిమీద సామే అవుతుంది.ఒకవేళ ఈ ఉపఎన్నిక జరిగి, అధికార కాంగ్రెస్ పార్టీ దానం నాగేందర్‌ను నిలబెట్టి మళ్లీ గెలిపించుకుంటే.. అది బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మవిశ్వాసాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తనకున్న పట్టు చేజారిపోయిందని, పార్టీ మారిన నేతను కూడా ఓడించలేకపోయామనే బలహీనమైన సంకేతం రాష్ట్రవ్యాప్తంగా వెళ్తుంది. ఇది జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో గులాబీ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రత్యర్థి చేతిలో దెబ్బతిని నైతికంగా కుంగిపోవడం కంటే, ఇలాంటి ప్రతికూల సమయంలో ఉపఎన్నికలను ఎదుర్కోవడం పార్టీకి రాజకీయంగా పెద్ద రిస్క్ అనే చెప్పాలి.అందుకే ఈ ఖైరతాబాద్ ఉపఎన్నిక అటు బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, ఇటు అధికార కాంగ్రెస్‌కు కూడా ఒక అన్‌వాంటెడ్ తలనొప్పి లాంటిదే. అధికారంలో ఉండి ఒక్క ఉపఎన్నికలో కూడా తేడా రాకూడదనే ఒత్తిడి కాంగ్రెస్‌పై ఉంటే.. పరువు కాపాడుకోవాల్సిన డూ ఆర్ డై సిట్యువేషన్ బీఆర్ఎస్‌ను వెంటాడుతోంది. గెలిస్తే వచ్చే మైలేజీ కంటే, పోరపాటున ఓడిపోతే ఎదురయ్యే నష్టమే బీఆర్ఎస్‌కు పదిరెట్లు ఎక్కువగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతే. అయినా ఉపఎన్నికను రెండు పార్టీలు ఎదుర్కోక తప్పదు.

వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టుకు ఫుల్ క్రేజీ



వరంగల్, : తెలంగాణ కాంగ్రెస్‌లో ఏ పోస్టుకు లేనంత క్రేజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులకు ఉంటుంది. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి.. ఒక లక్కీ పోస్ట్‌గా భావిస్తుంటారు నేతలు. ఎందుకంటే పీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు పనిచేసిన లీడర్లు ఉన్నత స్థానాలకు ఎదుగుతారనే సెంటిమెంట్ ఉంది. ప్రస్తుతం మంచి పొజిషన్‌లో ఉన్న నేతలంతా కూడా తెలంగాణ ఏర్పడిన తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసినవారే. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్ ఇలా అందరూ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేశారు.తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదట వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి తర్వాత పీసీసీ చీఫ్‌గా రికార్డ్ స్థాయిలో ఏడేళ్లు పని చేశారు. తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన భట్టి విక్రమార్క సీఎల్పీ లీడర్ అయ్యారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఉన్నారు. ఇక రేవంత్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి చేపట్టి తర్వాత.. పీసీసీ చీఫ్.. ఆ తర్వాత సీఎం అయ్యారు. మహేష్ కుమార్ గౌడ్ కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ తర్వాత పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. త్వరలో ఆయనకు కూడా ప్రమోషన్ దక్కబోతుందని ప్రచారం నడుస్తోంది. ఇలా వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పనిచేసిన వారికి తర్వాత లక్కీ ఛాన్స్ ఉంటుందనే బలమైన నమ్మకం ఉండటంతో..ఆశావహుల జాబితా పెరిగిపోతోంది.ప్రపంచ పటాలు పరిశీలించండిముఖ్య నేతలు కూడా తమ వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేస్తున్నారట. అయితే, ఈ పోస్టుల నియామకం కోసం పెద్ద కసరత్తే జరుగుతోందట. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు పోటీ పడుతున్న పలువురు పేర్లపై అభ్యంతరాలు వ్యక్తం చేశారట. దీంతో దాదాపు రెండేళ్లుగా ఈ పదవుల నియామకం పెండింగ్‌లో పడుతూ వచ్చింది. అనేక రకాల చర్చల తర్వాత.. వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకానికి పార్టీ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ బలంగా వినిపిస్తుంది.ప్రస్తుతం ఇంచార్జ్‌గా ఉన్న మీనాక్షి నటరాజన్ లండన్ వెళ్తున్నారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులపై ఆమె హైకమాండ్‌కు రిపోర్ట్ ఇచ్చేశారట. అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని అధిష్టానం భావిస్తోందట. రెడ్డి సామాజిక వర్గం నుంచి సీఎం రేవంత్ తన స్నేహితుడు రోహిణ్ రెడ్డి కోసం పట్టు బట్టడంతో.. ఇంచార్జ్ మీనాక్షి కూడా ఓకే చెప్పారట. మైనారిటీ వర్గం నుంచి సీఎం రేవంత్.. తన సన్నిహితుడు ఫహీం ఖురేషి పేరు ప్రతిపాదిస్తే ఇంచార్జ్ మీనాక్షి బ్రేక్ వేశారట. ఈ విషయంలో సీఎం కూడా వెనక్కి తగ్గారట. మైనారిటీ వర్గం నుంచి ఓబేదుల్లా కొత్వాల్ పేరు ఖరారైందట. ఎస్టీ వర్గం నుంచి ఎంపీ బలరాం నాయక్.. ఎస్సీ వర్గం నుంచి నంవత్ కుమార్ పేర్లను ఫిక్స్ చేశారని అంటున్నారు.వర్కింగ్ ప్రెసిడెంట్లతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రచార కమిటీ, మిగిలిన జనరల్ సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్ పోస్టులను కూడా భర్తీ చేయబోతున్నారట. నామినేటెడ్ పోస్టులకు కూడా హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చర్చించుకుంటున్నారు. ఈ నియామకాలన్నింటినీ వారం రోజుల్లోగా పూర్తి చేయాలని భావిస్తున్నారట పార్టీ పెద్దలు. ఈ సారైనా వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్టులకు గ్రహణం వీడుతుందో.? మళ్లీ ఏదైనా బ్రేకులు పడుతాయో.? చూడాలి మరి.


ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ

దానం భయం వెనుక కథేంటీ..?

హైదరాబాద్, : పార్టీ ఫిరాయింపు ఆరోపణలతో తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తీర్పు వచ్చిన వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని.. తాను ఫైటర్ నని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని అన్నారు. అంతలోనే ఏం జరిగిందో కానీ, మరుసటి రోజే తనకు న్యాయం చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. డైరీ నంబరు 58219/2026తో పిటిషన్ దాఖలు చేసిన ఆయన, ఇందులో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని ప్రతివాదిగా చేర్చారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పేరా 2(1)(ఎ), ఆర్టికల్ 191(2) కింద తనను అనర్హుడిగా ప్రకటించడం చట్టవిరుద్ధమని దానం నాగేందర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.ఎమ్మెల్యేల అనర్హత అంశంలో అసెంబ్లీ స్పీకర్ తీసుకునే నిర్ణయాలను కోర్టులు సమీక్షించడానికి వీలులేదని దానం నాగేందర్ ప్రధాన వాదన. ఒకవేళ సభ లోపల సభ్యుడి (ఎమ్మెల్యే) వ్యవహార శైలి ఆధారంగానే స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అసెంబ్లీ వెలుపల సభ్యుడి ప్రవర్తన లేదా ఇతర పార్టీ తరఫున పోటీ చేశారనే ఫిర్యాదులు స్పీకర్ పరిధిలోకి రావన్నారు. ఈ విషయంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయమని దానం నాగేందర్ స్పష్టం చేశారు. ఆర్టికల్ 226 కింద హైకోర్టు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవడం సరికాదని తన పిటిషన్‌లో ప్రస్తావించారు.తాను బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, అలాగే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. కేవలం మెడలో మూడరంగుల కండువా వేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌లో చేరినట్లు భావించకూడదన్నారు. కాగా, ఈ పిటిషన్‌పై తమ వాదనలు విన్నాకే తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. తన పిటిషన్‌ను సాధ్యమైనంత త్వరగా మెన్షన్ చేసి అత్యవసర విచారణ కోరాలని దానం నాగేందర్ తరఫు న్యాయవాదులు కోరారు.హైకోర్టు తీర్పుపై తొలుత ఉపఎన్నికకే తాను సిద్ధమని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానన్న దానం నాగేందర్, అంతలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించడం హాట్ టాపిక్ అవుతోంది. ఇటీవల ఇళ్ల లబ్ధిదారుల లక్కీ డ్రా ఎమ్మెల్యే లేకుండానే చేయడం, తమకు సరిగ్గా విలువ ఇవ్వడం లేదని.. అదే సమయంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు అయితే అధికారులు ఉ×చ్చ పోసుకుంటున్నారని అసెంబ్లీలో వ్యాఖ్యానించడం తెలిసిందే. ఇటు బీఆర్ఎస్ ఎలాగూ సీటు ఇవ్వదు. అటు కాంగ్రెస్ లోనూ జూబ్లీహిల్స్‌లో అజారుద్దీన్‌కు ఎదురైన పరిస్థితే ఖైరతాబాద్‌లో తనకు ఎదురవుతుందని దానం భావించారని వినిపిస్తోంది. బై ఎలక్షన్ వచ్చినా కాంగ్రెస్ తనకే బీ ఫారమ్ ఇస్తుందని నమ్మకం లేకపోవడంతో సుప్రీంకోర్టుకు వెళ్లారన్న చర్చ ఊపందుకుంది.పలుమార్లు పార్టీలు మారిన దానం, గతంలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ బీఆర్ఎస్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. అయితే, ఉపఎన్నికల్లో తనకు మద్దతు లభిస్తుందో లేదోనన్న ఆందోళనతో సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారని ప్రచారం జరుగుతోంది.

హైదరాబాద్, : రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది.ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తొలి అడుగులోనే పట్టు తప్పింది.సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద

యూపీఐ లావాదేవీల డేటాను సేకరించనున్న కేంద్రం...



దేశవ్యాప్తంగా యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలకు సంబంధించిన డేటాను సేకరించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, క్లినిక్‌లలో జరిగే ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరించడం ద్వారా విద్య, వైద్య రంగాల్లో నెలవారీ ఖర్చులపై స్పష్టమైన సమాచారం పొందాలని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ప్రస్తుతం యూపీఐ లావాదేవీల ఆధారంగా ప్రజలు డబ్బును ఏ రంగాల్లో, ఎలా ఖర్చు చేస్తున్నారనే విషయంపై కేంద్రం అంచనాలు వేస్తోంది. కొత్త ప్రతిపాదన అమల్లోకి వస్తే విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రతి నెల జరిగే లావాదేవీలపై మరింత కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. యూపీఐ లావాదేవీల్లో ప్రతి వ్యాపార సంస్థకు ప్రత్యేకమైన వ్యాపారి వర్గీకరణ కోడ్ ఉంటుంది. ఈ కోడ్‌ల ఆధారంగా ప్రైవేట్ పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, వృత్తి విద్యా సంస్థలు వసూలు చేసే ఫీజులు, ఆసుపత్రులు, క్లినిక్‌లలో జరిగే చెల్లింపులను గుర్తించవచ్చని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల సేవల రంగానికి సంబంధించిన గణాంకాల్లో ఉన్న లోటును భర్తీ చేయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదనపై గోప్యతకు సంబంధించిన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వ్యక్తుల ఆర్థిక లావాదేవీల వివరాలను పెద్ద స్థాయిలో సేకరించడం వల్ల వారి వ్యక్తిగత సమాచారానికి భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆసుపత్రులు, క్లినిక్‌లకు చేసిన చెల్లింపుల ద్వారా వ్యక్తుల ఆరోగ్యానికి సంబంధించిన సున్నితమైన వివరాలను పరోక్షంగా తెలుసుకునే అవకాశం ఉందనే ఆందోళనలు ఉన్నాయి. ఆర్థిక సమాచారాన్ని సేకరించే పేరుతో ప్రజల రోజువారీ లావాదేవీలలో జోక్యం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదేవిధంగా విద్యా సంస్థలకు చేసిన చెల్లింపుల ద్వారా విద్యార్థులు, వారి కుటుంబాలకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

భారత వృద్ధి రేటును పెంచిన ప్రపంచ బ్యాంకు



అంతర్జాతీయంగా పెరుగుతున్న ఇంధన ధరలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థికవ్యవస్థ అంచనాలను తలకిందులు చేస్తూ మెరుగైన వృద్ధిని నమోదు చేస్తోంది. దేశీయంగా వినియోగం పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి నిలకడగా ఉండటంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనాను 6.6 శాతం నుండి ఏకంగా 7.1 శాతానికి పెంచుతున్నట్టు ప్రపంచ బ్యాంక్ తెలిపింది. భారత్ ప్రభావంతో దక్షిణాసియా ప్రాంత మొత్తం వృద్ధి కూడా 60 బేసిస్ పాయింట్లు పెరిగి 6.9 శాతానికి చేరింది. ఇరాన్ ప్రాంతంలో అమెరికా-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల వల్ల చమురు సరఫరాకు ఆటంకం కలిగినప్పటికీ, విదేశాల నుంచి వచ్చిన రెమిటెన్సులు, ప్రజల డిమాండ్ ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా తట్టుకోవడానికి దోహదపడ్డాయని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది.

అయితే రాబోయే రోజుల్లో ఈ పురోగతికి కొన్ని సవాళ్లు పొంచి ఉన్నాయని వరల్డ్ బ్యాంక్ చీఫ్ ఎకనామిస్ట్ ఫ్రాంజిస్కా ఓన్స్‌సోర్జ్ హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ద్రవ్యోల్బణ ప్రభావం ఆర్థికవ్యవస్థపై స్పష్టంగా కనిపించడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుంది, కాబట్టి 2027 వరకు ధరల ఒత్తిడి కొనసాగవచ్చు. దీనికి తోడు ఎల్ నినో వల్ల వ్యవసాయం దెబ్బతింటే, గ్రామీణ డిమాండ్ తగ్గే ప్రమాదముంది. దీన్ని దాటుకుని, భవిష్యత్తులో వేగవంతమైన ఆర్థిక పురోగతితో పాటు ఉపాధి అవకాశాలను సృష్టించాలంటే ఏఐ వినియోగాన్ని మరింత వేగవంతం చేయాలని ప్రపంచ బ్యాంక్ సూచించింది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈక్విటీ బూస్ట్



దేశీయ తయారీ రంగానికి, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎస్ఎంఈలకు) ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన రూ. 10,000 కోట్ల 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్' కేటాయింపునకు కేంద్ర మంత్రివర్గం మంగళవారం తుది ఆమోదం తెలిపింది. ఈ నిధిని 'ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' (ఏఐఎఫ్) రూపంలో ఏర్పాటు చేసి, వృద్ధి దశలో ఉన్న పరిశ్రమలకు నేరుగా ఈక్విటీ పెట్టుబడులను అందజేస్తారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న చాలా నిధులు కేవలం ప్రారంభ దశ స్టార్టప్‌లు, మైక్రో సంస్థలకే సరిపోతున్నాయి. కానీ ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తూ వ్యాపారాన్ని మరింత విస్తరించుకోవాలని, సరికొత్త సాంకేతికతను అందుకోవాలని, అంతర్జాతీయంగా కొత్త కంపెనీలను కొనుగోలు చేయాలని భావిస్తున్న సంస్థలకు అవసరమైన దీర్ఘకాలిక మూలధనాన్ని అందించడమే ఈ ఫండ్ ప్రధాన లక్ష్యం.

ఈ కేటాయింపుల్లో సింహభాగం తయారీ రంగంలో ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకే అందుతుంది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాల్లోని పారిశ్రామిక క్లస్టర్లలో నడుస్తున్న పరిశ్రమలను పరిగణనలోకి తీసుకుంటారు. చిన్న నగరాల్లోని క్లస్టర్లలో ఈ పెట్టుబడులు రావడం వల్ల స్థానిక సప్లై చైన్‌లు బలపడటమే కాకుండా కొత్త ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పరిశ్రమల ఉత్పాదకతను పెంచడం, ఎగుమతులను వేగవంతం చేయడం, భారతీయ ఎస్ఎంఈలకు ప్రపంచ సప్లై చైన్‌లలో విలీనం చేయడం ద్వారా దేశీయ ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మరోసారి పెరగనున్న టెలికాం రీఛార్జ్ ధరలు!



టెలికాం యూజర్ల జేబులకు త్వరలోనే పెద్ద చిల్లు పడనుంది. దేశీయ టెలికాం రంగంలో పోటీ తగ్గి, మార్కెట్ స్థిరంగా ఉండటంతో రాబోయే 4 నుండి 5 నెలల్లో మొబైల్ రీఛార్జ్ ధరలను మరో 12 నుండి 15 శాతం వరకు పెంచేందుకు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సంస్థలు సిద్ధమవుతున్నాయి.

దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ కవరేజీని వేగంగా విస్తరించడం, హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తేవడం, కంపెనీల నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరగడమే ఈ టారిఫ్ పెంపునకు ప్రధాన కారణం.

దీనికి తోడు ప్రతి వినియోగదారుడి నుండి వచ్చే సగటు ఆదాయాన్ని (ఆర్పు) పెంచుకోవాలని కంపెనీలు భావిస్తుండటంతో, నెలవారీ రీఛార్జ్ ప్లాన్ల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్న సామాన్యులు, డిజిటల్ వినియోగదారులపై ఈ తాజా టారిఫ్ బాదుడు అదనపు ఆర్థిక భారంగా మారనుంది. ఇప్పటికే, జూన్ తర్వాత జియో కొత్తగా 80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను చేర్చుకొని తన యూజర్ బేస్‌ను 54.1 కోట్లకు పెంచుకోగా, ఆర్పు నెలకు రూ. 218కి చేరింది. అలాగే భారతీ ఎయిర్‌టెల్ 30 లక్షల కొత్త సబ్‌స్క్రైబర్లతో మొత్తం 38 కోట్లకు చేరడంతో పాటు, పరిశ్రమలోనే అత్యధికంగా రూ. 269 ఆర్పుని నమోదు చేసింది.

పుంజుకున్న స్టాక్ మార్కెట్ .. సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో



వరుస నష్టాల తర్వాత భారత స్టాక్ మార్కెట్ సోమవారం లాభాల్లోకి వచ్చింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు భారీగా పుంజుకున్నాయి.

ఉదయం సెన్సెక్స్ 643.98 పాయింట్లు లేదా 0.90 శాతం లాభపడి 72,451 వద్దకు చేరింది. నిఫ్టీ 50 సూచీ 164.85 పాయింట్లు లేదా 0.74 శాతం పెరిగి 22,582 వద్ద ట్రేడైంది. నిఫ్టీ లాభాల్లో కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ రంగాల సూచీలు కీలకంగా నిలిచాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ కూడా కొనుగోళ్ల మద్దతుతో లాభపడ్డాయి. అనూప్ బాగ్చీని కొత్త సీఈఓగా నియమించినట్లు ప్రకటించిన నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా లాభాల్లో ట్రేడయ్యాయి.అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు దేశీయ మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ముడి చమురు ధరలు తగ్గడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలు తగ్గడం పెట్టుబడిదారుల్లో ఆందోళనలను కొంతమేర తగ్గించాయి. అయితే, గత వారం మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 1,986 పాయింట్లు, నిఫ్టీ 719 పాయింట్లు కోల్పోయాయి. దీంతో వరుసగా ఎనిమిదో వారాన్ని కూడా నష్టాలతో ముగించాయి. గత 25 ఏళ్లలో ఇదే అత్యంత సుదీర్ఘమైన వారపు పతనంగా నమోదైంది.

హోమ్, కార్ లోన్లు ఉన్నవారికి బిగ్ షాక్...



- రెపో రేటు పెంచిన ఆర్‌బీఐ

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మూడు రోజుల పాటు నిర్వహించిన ద్రవ్యపరపతి విధాన సమీక్ష (ఎంపీసీ) సమావేశం ముగిసింది. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడిస్తూ ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా రుణాలు తీసుకునేవారికి కోలుకోలేని షాక్ ఇచ్చారు. ఆర్‌బీఐ అందరినీ(గ్రాహ్యంతికి గురిచేస్తూ కీలక వడ్డీ రేటైన 'రెపో రేటు'ను పెంచుతున్నట్లు ప్రకటించింది. దాదాపు 25 బేసిస్ పాయింట్ల (బీపీఎస్) మేర పెంచడంతో రెపో రేటు ఇప్పుడు 5.50 శాతానికి చేరింది. నిజానికి గడిచిన దాదాపు మూడున్నరేళ్లుగా ఈ రేటు 5.25 శాతం వద్దే స్థిరంగా కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడు సెంట్రల్ బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంతో హోమ్ లోన్లు, కార్ లోన్లు లేదా ఏవైనా ఇతర ఈఎంఐలు చెల్లిస్తున్న సామాన్యుల జేబులపై అదనపు భారం పడటం ఖాయంగా కనిపిస్తోంది. పశ్చిమాసియాలో చెలరేగిన యుద్ధ మేఘాలు, అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు అమాంతం పెరిగిపోవడాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరగడం, ఇంధన ధరల భారం నుంచి నిత్యావసరాలు, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే ఎంపీసీ సభ్యులందరూ కలిసి రెపో రేటును పెంచాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారని ఆయన స్పష్టం చేశారు. ఈ ఏడాది 2026లో ఆర్‌బీఐ జరిపిన నాలుగో ఎంపీసీ సమావేశం ఇది. అంతకుముందు ఏప్రిల్, జూన్, ఆగస్టు నెలల్లో జరిగిన సమీక్షల్లో రెపో రేటును మార్చకుండా 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచారు. అయితే, ముడి చమురు ధరల్లో మంటలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని చూస్తుంటే ఈసారి ఆర్‌బీఐ ఖచ్చితంగా 25 బీపీఎస్ మేర వడ్డీ రేట్లను పెంచుతుందని ఆర్థిక నిపుణులు ముందే ఊహించారు. అందరూ అనుకున్నట్లుగానే ఇప్పుడు కేంద్ర బ్యాంక్ కూడా అదే నిర్ణయానికి ముద్ర వేసింది.

అసలు ఏమిటీ 'రెపో రేట్'? దీనివల్ల సాధారణ ప్రజలపై ఎలాంటి ప్రభావం పడుతుంది? చాలా సులభంగా చెప్పుకోవాలంటే.. కమర్షియల్ బ్యాంకులు తమ అత్యవసర స్వల్పకాలిక అవసరాల కోసం ఆర్‌బీఐ నుంచి తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీ రేటునే 'రెపో రేట్' అంటారు. ప్రతీ రెండు నెలలకోసారి ఆర్‌బీఐ ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తుంది. ఈ రేటు పెరిగినా తగ్గినా దాని ప్రభావం నేరుగా లోన్లు తీసుకున్న సామాన్యులపైనే పడుతుంది. ఆర్‌బీఐ రెపో రేటును పెంచితే బ్యాంకులు పొందే రుణాలు పెరుగుతాయి. దాంతో బ్యాంకులు ఆ భారానంతా తమ కస్టమర్లపైకి నెట్టేస్తాయి. ఫలితంగా మనం తీసుకునే హోమ్, పర్సనల్, కార్ లోన్లపై వడ్డీ రేట్లు పెరిగి ఈఎంఐలు పెరుగుతాయి. ఒకవేళ రెపో రేటును తగ్గిస్తే లోన్లు చౌకగా మారి ఈఎంఐ భారం తగ్గుతుంది. కానీ ఈసారి రేట్లు పెరగడంతో సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై దెబ్బపడనుంది.

ఎన్ఎస్ఇ షేర్ 9 శాతం పతనం..!



నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ) షేర్ లిస్టింగ్ రోజు నమోదైన లాభాలను కోల్పోయి ఐపిఒ ధర కంటే దిగువకు పడిపోయింది. సెప్టెంబర్ 24న రూ. 1,785 ఐపిఒ ధరతో పోలిస్తే స్వల్ప లాభంతో రూ. 1,800 వద్ద లిస్టయిన షేరు.. అదే రోజు రూ. 1,878 గరిష్ఠాన్ని తాకింది. దీంతో ఎన్ఎస్ఇ మార్కెట్ విలువ రూ. 4.64 లక్షల కోట్లకు చేరింది. అయితే ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సోమవారం షేరు రూ. 1,712 కనిష్ఠానికి పడిపోయింది. లిస్టింగ్ గరిష్ఠంతో పోలిస్తే దాదాపు 9 శాతం, ఐపిఒ ధరతో పోలిస్తే 4 శాతం నష్టపోయింది. షేరు పతనంతో ఎన్ఎస్ఇ గరిష్ఠ మార్కెట్ విలువ నుంచి దాదాపు రూ. 41,000 కోట్ల సంపద ఆవిరైంది. ప్రస్తుతం సుమారు రూ. 4.27 లక్షల కోట్ల మార్కెట్ విలువతో దేశంలోని అత్యంత విలువైన కంపెనీల జాబితాలో 12వ స్థానానికి పడిపోయింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గడం, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. మంగళవారం సెన్సెక్స్ 685.34 పాయింట్లు పెరిగి 73,067.81కు చేరింది. నిఫ్టీ 220.35 పాయింట్లు లాభపడి 22,776.10 వద్ద ముగిసింది. రూపాయి విలువ డాలర్‌కు 96.43గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ చమురు ధర 98.64 డాలర్లుగా నమోదయ్యింది.

రిలయన్స్ క్యాంపా డ్రింక్స్‌కు ఢిల్లీ హైకోర్టు బిగ్ రిలీఫ్



ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలికంగా పెద్ద ఊరట లభించింది. తమ 'క్యాంపా' ఉత్పత్తులను 'ఎనర్జీ డ్రింక్స్' పేరుతో మార్కెట్‌లో విక్రయించడం కొనసాగించడానికి కోర్టు అనుమతినిచ్చింది. ల భారత ఆహార భద్రతా మండలి (ఎఫ్ఎస్ఎస్ఏఐ) జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ అక్టోబర్ 1న పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసును విచారించిన హైకోర్టు, రిలయన్స్‌పై చర్యలు తీసుకునే ముందు ఎందుకు ముందస్తు నోటీసు ఇవ్వలేదని ఎఫ్ఎస్ఎస్ఏఐని ప్రశ్నించింది. అలాగే తన తప్పును దిద్దుకోవడానికి సమయం ఉందని వ్యాఖ్యానించిన కోర్టు, తదుపరి విచారణను నవంబర్ 5కి వాయిదా వేసింది. ఇదే అంశంపై పెప్సికో, మాన్‌స్టర్ బెవరేజ్ వంటి దిగ్గజ కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్లను కూడా అదే రోజున విచారించనుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ తీసుకున్న నిర్ణయం వల్ల తమ వ్యాపారానికి భారీ నష్టం వాటిల్లిందని రిలయన్స్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మార్కెట్‌లో ఎనర్జీ డ్రింక్ అని ముద్రించిన 16.8 కోట్ల క్యాన్లు, 1.2 కోట్ల బాటిళ్ల స్టాక్ నిలిచిపోవడంతో పాటు మరో 7.6 కోట్ల ప్యాకేజింగ్ మెటీరియల్ వృథా అయ్యే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది.

ఒక్కో రోజు పళ్లు తోముకోకపోతే ఇంత డేంజరా



పళ్లు తోముకోకపోవడం కేవలం దంత సమస్యలే కాదు..ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. నోటిలోని బ్యాక్టీరియా గుండె జబ్బులు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, నోటి క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యాలకు కారణమవుతుంది. రోజుకు ఒక్కసారి పళ్లు తోముకోకపోవడం కూడా ప్రమాదకరం. మీ మొత్తం శరీర ఆరోగ్యం కోసం రోజూ రెండుసార్లు బ్రష్ చేయడం తప్పనిసరి. చలికాలంలో చల్లటి నీళ్లకు భయపడి చాలా మంది పళ్లు తోముకోవడానికి బద్ధకిస్తారు. ఒక రోజు తోముకోకపోతే ఏమవుతుందిలే అని అనుకుంటారు. కానీ ఈ చిన్న అలవాటు ప్రాణాపాయానికి కూడా దారితీసే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు, అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ప్రకారం.. మీరు తిన్న 20 నిమిషాల్లోనే నోటిలోని బ్యాక్టీరియా చక్కెర, స్టార్చ్‌ను ఆమ్లంగా మారుస్తుంది. ఈ ఆమ్లం దంతాల బయటి పొర అయిన ఎనామిల్‌ను దెబ్బతీయడం ప్రారంభిస్తుంది. తిన్న 4-6 గంటల తర్వాత దంతాలపై ప్లేక్ అనే జిగట పొర ఏర్పడటం మొదలవుతుంది. 12 గంటల తర్వాత ఈ ప్లేక్ గట్టిపడి టార్టార్‌గా మారుతుంది. 24 గంటల తర్వాత చిగుళ్ళు ఉబ్బడం, రక్తస్రావం కావడం, నోటి నుండి దుర్వాసన రావడం ప్రారంభమవుతుంది. ఎయిమ్స్‌కి చెందిన దంతవైద్యుల అభిప్రాయం ప్రకారం.. మీరు ఒక రోజు పళ్లు తోముకోకపోతే మీ నోటిలో ఒక మిలియన్ బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంది. పళ్లు తోముకోకుండా ఈ అలవాటును కొనసాగించడం అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు, చివరికి మరణానికి కూడా దారితీయవచ్చు.

మరణ ప్రమాదం పెరుగుదల: లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజూ పళ్లు తోముకోని వ్యక్తులకు మరణ ప్రమాదం 25 శాతం పెరుగుతుంది. గుండె జబ్బుల ముప్పు: మీరు ఒక సంవత్సరం పాటు పళ్లు తోముకోకపోతే మీ గుండె జబ్బుల ప్రమాదం మూడు రెట్లు పెరుగుతుంది. నోటిలోని బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి ప్రవేశించి ధమనులలో వాపును కలిగిస్తుంది. ఇది గుండె సమస్యలకు దారితీస్తుంది. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు: ఇదే బ్యాక్టీరియా ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, న్యుమోనియాకు కూడా కారణమవుతుంది. నోటి క్యాన్సర్: పొగాకు వాడకపోయినా, పళ్లు తోముకోని వారికి నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దంత క్షయం: ఒక సంవత్సరం పాటు పళ్లు తోముకోకపోతే దంతాలు పూర్తిగా కుళ్ళిపోయి, కుహరాలు, చీము, విపరీతమైన నొప్పికి దారితీస్తాయి. ఇది చిగుళ్ల వ్యాధికి కారణమై, దంతాలు వదులై ఊడిపోయే ప్రమాదం ఉంది.

అరటి పండును అలుసుగా చూడొద్దు...!



అరటిపండ్లలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను తగ్గిస్తుంది. అరటిపండులో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. కాబట్టి దీనిని తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. దీనితో పాటు, అరటిపండులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అరటిపండు తినడం వల్ల శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. ఆకలి నియంత్రణలో ఉండటంతో బరువు పెరగదు. పొటాషియం అధికంగా ఉండి గుండె ఆరోగ్యానికి మంచిది. మనసు హాయిగా ఉండేలా సీరోటోనిన్ పెరుగుతుంది.

కండరాలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. రోజూ అరటిపండు తినడం పూర్తిగా ఆరోగ్యానికి మంచిది. అనేక పోషకాలతో నిండిన అరటిపండు తినడం వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ఖాళీ కడుపుతో ఒక అరటిపండు తినడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో మీకు తెలుసా? నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఖాళీ కడుపుతో ఒక అరటిపండు తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటిపండులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అరటిపండ్లలో పొటాషియం ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను తగ్గిస్తుంది. అరటిపండులో ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం ఉంటుంది. కాబట్టి దీనిని తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. దీనితో పాటు, అరటిపండులో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది కీళ్లను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. అరటిపండులోని ఫైబర్, చక్కెర రక్తంలో కలిసే ప్రక్రియను నెమ్మదిస్తుంది. దీని ద్వారా ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుంది. అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం అనే రెండు ముఖ్యమైన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. పొటాషియం శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

చలికాలం స్నానం మానేస్తే ఏం జరుగుతుంది..?

చలికాలంలో స్నానం మానేయాలా? చల్లని వాతావరణం వల్ల చాలామంది స్నానం చేయలేకపోతున్నారు. స్నానం చేయకపోతే అలర్జీలు, దుర్వాసన వస్తాయని కొందరు, అతిగా చేస్తే సహజ నూనెలు పోయి చర్మం పొడిబారుతుందని నిపుణులు చెబుతున్నారు. స్నానం మానేస్తే ఆయుష్షు పెరుగుతుందనే వాదన జంతువులపై చేసిన పరిశోధనలే కానీ, మానవులకు వర్తించదని స్పష్టం చేశారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడం ముఖ్యం. చలికాలం స్నానం చేయడానికి చాలా మంది ఇబ్బందిపడుతుంటారు. చల్లటి గాలులు, శీతల వాతావరణం కారణంగా నీళ్లు ముట్టుకోవాలంటేనే వణుకు పుడుతుంది. అందుకే స్నానం చేయాలంటే చాలా మందికి భయం. వేడి నీటితో స్నానం చేసినా చలి ఎక్కువ అవుతుంది. అయితే, స్నానం చేయకపోతే ఏం జరుగుతుంది..? చెమట శరీరంపై అలాగే పేరుకుంటుంది. ఇది రానురాను అలర్జీలకు దారితీస్తుంది. శరీరం నుంచి దుర్వాసన వస్తుంది. అందుకే తప్పనిసరిగా స్నానం చేయడమే మంచిది. అయితే, ప్రత్యేకంగా శరీరాన్ని తరచూ కడుగుతూ స్నానం చేయడం వల్ల బయట నుంచి వచ్చే జీవాణువులకు నిరోధకంగా పనిచేసే సహజ నూనె తగ్గిపోతుందని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. పైగా చలికాలంలో చర్మం మరింత పొడిబారే అవకాశం ఉంటుందని అంటున్నారు. అయితే.. చలికాలంలో స్నానం మానేస్తే ఆయుష్షు పెరుగుతుందని చెబుతూ ఓ పరిశోధన వార్త గతంలో సోషల్ మీడియాలో వైరల్ మారింది. దీని ప్రకారం శరీర ఉష్ణోగ్రత తగ్గితే జీవక్రియ నెమ్మదిస్తుందని, ఆక్సీకరణ ఒత్తిడి తక్కువ అవుతుందని చెబుతున్నారు. దీని వల్ల వృద్ధాప్యం ఆలస్యం అవుతుందని కొన్ని ప్రయోగాలు సూచించాయి. కానీ.. ఇందులో నిజం లేదంటున్నారు నిపుణులు.. ఈ పరిశోధనలన్నీ జంతువులపై చేసిన అధ్యయనాలు మాత్రమే అంటున్నారు.



చలికాలం స్నానం చేయడానికి చాలా మంది ఇబ్బందిపడుతుంటారు. చల్లటి గాలులు, శీతల వాతావరణం కారణంగా నీళ్లు ముట్టుకోవాలంటేనే వణుకు పుడుతుంది. అందుకే స్నానం చేయాలంటే చాలా మందికి భయం. వేడి నీటితో స్నానం చేసినా చలి ఎక్కువ అవుతుంది. అయితే, స్నానం చేయకపోతే ఏం జరుగుతుంది..? చెమట శరీరంపై అలాగే పేరుకుంటుంది. ఇది రానురాను అలర్జీలకు దారితీస్తుంది. శరీరం నుంచి దుర్వాసన వస్తుంది. అందుకే తప్పనిసరిగా స్నానం చేయడమే మంచిది. అయితే, ప్రత్యేకంగా శరీరాన్ని తరచూ కడుగుతూ స్నానం చేయడం వల్ల బయట నుంచి వచ్చే జీవాణువులకు నిరోధకంగా పనిచేసే సహజ నూనె తగ్గిపోతుందని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. పైగా చలికాలంలో చర్మం మరింత పొడిబారే అవకాశం ఉంటుందని అంటున్నారు.మానవులపై ఇదే ప్రభావం ఉంటుందని ఇంకా ఎలాంటి స్పష్టమైన ఆధారాలు లేవని స్పష్టం చేశారు. అయితే అతిగా స్నానం చేయడం వల్ల చర్మంలోని సూక్ష్మజీవులు దెబ్బతింటాయని సహజ రక్షణ, కానీ పూర్తిగా స్నానం చేయకపోవడం పరిశుభ్రత సమస్యలు ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని తెలిపారు.

మెంతులు.. ఆరోగ్యానికి అద్భుతం కానీ!



మెంతులు తెలుగు ఇంటి వంటల్లో దాదాపు తప్పనిసరి పదార్థం. జీర్ణక్రియ మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడం, జుట్టు ఆరోగ్యం, చర్మ సౌందర్యం – ఇలా అనేక ఆయుర్వేద గుణాలకు ప్రసిద్ధి చెందిన ఈ చిన్న గింజలు రోజువారీ ఆహారంలో భాగమే. కానీ ఇటీవలి అధ్యయనాలు, నిపుణుల హెచ్చరికలు ఈ మెంతుల వాడకం గురించి కొత్త కోణాన్ని చూపుతున్నాయి. గర్భిణీ స్త్రీలు మెంతులను అధికంగా తీసుకుంటే గర్భస్థ శిశువుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మొదటి త్రైమాసంలో మెంతుల్లోని కొన్ని సమ్మేళనాలు గర్భాశయ సంకోచాలను ప్రేరేపించి అకాల గర్భస్రావం రిస్క్‌ను పెంచుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. అంతేకాదు, అతి తక్కువ సందర్భాలలో అరుదైన జన్యు వ్యాధి అయిన మాపుల్ సిరప్ యూరిన్ డిసీజ్ బిడ్డకు వచ్చే ప్రమాదం కూడా లేదని అనిపించదు. ఇక రొమ్ము క్యాన్సర్ ఉన్న లేదా రిస్క్‌లో ఉన్న మహిళల విషయంలో మెంతులు మరింత జాగ్రత్త అవసరం చేస్తాయి. మెంతుల్లో ఫైటోఈస్ట్రోజెన్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి, ఇవి శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్‌ను అనుకరిస్తాయి.

ఒకే ఒక్క సినిమా నా జీవితాన్ని మార్చేసింది..



కోలీవుడ్‌లో నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యంగ్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ అనిష్మా అనిల్ కుమార్. 'యూత్', 'సిరాయ్' వంటి సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకున్న ఈ అమ్మడు, ప్రస్తుతం దర్శకుడు అమీర్ కాంబినేషన్‌లో 'మకాలి' అనే చిత్రంలో నటిస్తోంది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన అనుబంధం, ఎమోషన్స్ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఇటీవల పూర్తి కాగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనిష్మా, తన చిన్ననాటి జ్ఞాపకాలను షేర్ చేసుకుంటూ తమిళ భాషపై ఉన్న ప్రేమను బయటపెట్టారు. చిన్నప్పుడు వాళ్ల అమ్మ వేరే జిల్లాలో ఉద్యోగం చేయడం వల్ల ఇంట్లో తండ్రీకూతుళ్లు ఇద్దరే ఉండేవాళ్లమని, అర్ధరాత్రి దాటిన తర్వాత రాత్రి 2 గంటల సమయంలో నాన్నతో కలిసి సినిమాలు చూసేదాన్ని అని తెలిపారు.

అలా విజయ్ నటించిన 'గిల్లి', 'అళగియ తమిళ్ మగన్' వంటి సినిమాలు చూడటం, తమిళ పాటలు వినడం వల్ల ఆ భాషపై బాగా ఆసక్తి పెరిగిందని వెల్లడించారు. అలా సినిమాలు చూస్తూ చూస్తూనే తాను ఒకటో తరగతిలోనే తమిళం చదవడం, రాయడం నేర్చుకున్నానని తెలిపారు. 'అళగియ తమిళ్ మగన్' సినిమాలో ఒక క్యారెక్టర్ తన పేరు గురు, స్వస్థలం గురువాయూర్ అని చెప్పే సీన్ ఉంటుందని గుర్తుచేశారు. దాంతో ఇన్స్పైర్ అయి తాను కూడా తన స్వస్థలం 'కట్టకడై' అని రాయడం ప్రాక్టీస్ చేశానని చెప్పారు. సినిమా తన జీవితాన్నే మార్చేసిందని.. ఒక భాషపై అమితమైన ప్రేమ కలిగిందని, దాని వల్లే తనకు తమిళం అంటే ఎంతో ఇష్టం ఏర్పడిందని తెలిపారు. ఇప్పుడు ఆ భాష నిజంగానే తన లైఫ్‌లో ఒక పార్ట్ అయిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు.

షూటింగ్ కంప్లీట్ చేసుకున్న అనన్య నాగళ్ల 'లీసా'



విలక్షణమైన పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లీసా'. ఓం సాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై వెంకట్ దుగ్గిరెడ్డి, రామకృష్ణ ఐల సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీతో జవహర్ పవార్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు రాని విధంగా రెండు భిన్నమైన జోనర్లను సరికొత్త పద్ధతిలో మేళవించి రూపొందిస్తున్న ఈ సినిమాకు 'ఎస్సార్ కళ్యాణమండపం' దర్శకుడు శ్రీధర్ గాదె ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. అంతే కాకుండా.. ఈ సినిమాకు 'మెలోడీ బ్రహ్మ' మణిశర్మ సంగీతం అందించడం విశేషం. ఇదిలా ఉంటే.. ఇటీవలే 'లీసా' షూటింగ్ విజయవంతంగా పూర్తి కాగా.. సినిమా రిలీజ్‌పై అప్డేట్ ఇచ్చారు మేకర్స్. 'మా సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చూసిన రషెస్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి, చిత్ర బృందం మొత్తం ఔట్‌పుట్ పట్ల ఎంతో నమ్మకంతో ఉంది. ఇది ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది.

సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల అద్భుతమైన నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని నవంబర్ నెలలో సినిమాను ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వబోతున్న 'ప్రేమలు' బ్యూటీ



'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారి అన్ని ఇండస్ట్రీల్లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ తన క్యూట్ లుక్స్, యాక్టింగ్‌తో కుర్రకారు హృదయాలను కొల్లగొట్టింది. ఆ తర్వాత తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంటూ ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనిట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి
విజయాన్ని సాధించి సరికొత్త రికార్డులు సృష్టించాయి. ఇలా వరుస విజయాలతో తమిళంలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న మమిత, తెలుగు సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

అదీ కూడా తన మొదటి తెలుగు సినిమాలోనే ఏకంగా సూపర్ స్టార్ మహేష్ బాబు సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుందనే వార్త ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం 'వారణాసి' షూటింగ్‌లో బిజీగా ఉన్న మహేష్ బాబు.. తన తదుపరి అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో మమితను హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్లు టాక్. ఒకవేళ ఇదే నిజమైతే మమితా బైజు కెరీర్‌కి తెలుగులో ఇది ఊహించని బిగ్ ఆఫర్ అని చెప్పవచ్చు. సూపర్ స్టార్ పక్కన నటిస్తే టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా స్థిరపడటం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ క్రేజీ కాంబినేషన్ న్యూస్ విన్న మహేష్ ఫ్యాన్స్, మూవీ లవర్స్ మాత్రం ఎగ్జైట్‌మెంట్‌తో ఈ కాంబో ఓకే అయితే బాగుండు అని కోరుకుంటున్నారు.

మాతోపాటు మీరు ఎంజాయ్ చేస్తారు.....



రాజ్ తరుణ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'టార్టాయిస్'. అమృత చౌదరి, అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీని ఎస్ కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్వీత ఎంటర్టైన్మెంట్, ఎన్ వీ ఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్నారు. సస్పెన్స్, డ్రామా కలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథతో దర్శకుడు రిత్విక్ కుమార్ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షించగా.. తాజాగా 'నీ పరిచయం..' పాటను గ్రాండ్‌గా రిలీజ్ చేశారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja Publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215